వాఙ్మయి



కావ్యకళాప్రవీణ – సహజకవితా కళాభిజ్ఞ

డా.చింతలపాటి మోహనమురళీకృష్ణ

వాఙ్మయ

ఖండకావ్యము

:రచన:

కావ్యకళాప్రవీణ , సహజ కవితాకళాభిజ్ఞ

డా.చింతలపాటి మోహనమురళీకృష్ణ

వాఙ్మయి

ఖండకావ్యము

డా. చింతలపాటి మోహనమురళీకృష్ణ

ప్రథమముద్రణ : మే , 2024.

ప్రతులు : 100

వెల : రు. 60

ప్రతులకు :

డా.చింతలపాటి మోహనమురళీకృష్ణ

23-175 ఏ, రామానాయుడుపేట

మచిలీపట్నం - 521001

(చరవాణి : +91 6303885869)

టిడిపి: శ్రీధర్

ముున్నుడి . . .

వాఙ్మయి ఖండకావ్య రచన నేను క్వీన్స్ లాండ్ లో ఉండగా చేశాను. ఆ రోజుల్లో వేర్వేరు దేశాల్లో ఉండే తెలుగువారు తీరికవేళల్లో రకరకాలుగా కలిసే సందర్భంలో అంతర్జాలంలో నేను మెల్ బోర్న్ లోని "తెలుగుమల్లి" రావు కొంచాడ గారిని, ఇంకొందరు మిత్రులను కలిశాను. వారు తెలుగు పద్యాలను వ్రాసే ప్రయత్నంలో ఉన్నారు. తటవర్తి కల్యాణచక్రవర్తిగారి వద్ద పద్యవిద్య నేర్చుకొంటున్నారు. వారిని చూచి నాకూ ఉత్సాహం కలిగింది. నేను కూడా వారితో కలిశాను. అయితే అప్పటికే కొన్ని పద్యకావ్యాలు వ్రాసి ఉన్న నాకు వీరి ప్రయత్నం మంచిప్రోత్సాహాన్ని కలుగజేసింది. అందువల్ల నేనూ వారితో సమానంగానే కలిసి నడిచాను. ఆ సందర్భంలో ఒకరోజు కొంచాడవారు అందరికీ ఒక సవాలు విసిరారు. అందరూ తలొక పద్యకావ్యాన్ని వెంటనే మొదలుపెట్టి వ్రాయాలని., వీలైనంత త్వరగా వ్రాసి చూపిస్తే దానిని తాము ముద్రింపిస్తామని ఆశ పెట్టారు. నేనుకూడా అందరినీ ఉసిగొలిపాను. కానీ ఆస్ట్రేలియాలో పనీపాటలేకుండా తీరికగా ఉంటున్న నేను మాత్రం వ్రాయకూడదా అని నా కనిపించింది. అంతే. . . అప్పటికప్పుడు మొదలుపెట్టాను. నిర్విరామంగా 25 శీర్షికలు వ్రాశాను. పది రోజుల్లో 342 పద్యాలతో "వాఙ్మయి" ని పూర్తిచేశాను. ఇదంతా 2020 లో జరిగింది. అప్పటికి "కరోనా" మహమ్మారి ప్రపంచమంతటా వ్యాపించి మారణహోమం చేస్తోంది. ఆ సంగతి తలుచుకుంటేనే భయంతో చచ్చిపోయే రోజులు. అందుకని దృష్టి మరల్చుకోవటానికి వేరేవో అంశాలను తలుచుకొని వాటిగురించి ఈ కావ్యంలో వ్రాయటం జరిగింది. మానవజన్మ ఎంత క్షణికమైనదో ఆరోజుల్లో ప్రతిక్షణంలోనూ మారుమ్రోగుతూఉండేది. ఆ పరిస్థితులలో మనసును మళ్లించుకొని, ఒకరకంగా నిగ్రహించుకొని వ్రాసిన రచన యిది. ఆదర్శంగా కావాల్సిన కావ్యసామగ్రిని సమీకరించుకొనే దృష్టిలేదు. రసపోషణగురించిన విమర్శలేదు. ఈ అభిప్రాయాన్ని నేనే మనవి చేస్తే ఆపాటి పరిశీలన చేయలేనివారుకూడా ఇదేమాటను ప్రచారంచేయవచ్చు. అయినా నిబద్ధతగల రచయితగా ఆత్మసమీక్ష చేసుకొంటూ చెప్పాను. ముందుచెప్పినట్లుగా 25 శీర్షికలతో వ్రాసిన కావ్యంనుంచి 15 శీర్షికలను 200 పద్యాలతో తీసుకొని ఇప్పుడు "వాఙ్మయి" కావ్యంగా అందిస్తున్నాను. మిగిలినవాటికి మరికొన్ని పద్యాలను కలిపి వేరొక కావ్యంగా అందిస్తాను.

ఈ కావ్యావిర్భావానికి ప్రేరకులైన ఆస్ట్రేలియా తెలుగువారికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. జన్మభూమి వాసులకు ఎల్లవేళలా కృతజ్ఞుడనయ్యే ఉంటాను.

భవదీయుడు

5, జనవరి, 2024.

డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ

సాహిత్య విద్యాప్రవీణ, సాహిత్య విశారద,
డా. రాయప్రోలు వేంకట కామేశ్వర శర్మ.,
ఎం.ఏ.,(ఇం).,ఎం.ఏ.,(తె). ఎం.ఏ.,(సం)
ప్రభుత్వ అటానమస్ కళాశాల , రాజమహేంద్రవరం

కొవ్వూరు,
5-1-2024

ఆత్మీయ నివేదనము

సంస్కృతాంధ్రాంగ్ల భాషావిశారదులు, కవిపండితశ్రేష్ఠులు, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు, అవిశ్రాంత సాహితీ కృషీవలులు, డా. చింతలపాటి మురళీకృష్ణగారి కలం నుండి జాలువారిన "వాఙ్మయి" అనే ఖండకావ్యాన్ని పూర్తిగా చదివాను.

ఈ కావ్యంలో 15 శీర్షికలలో 200 పద్యాలు ఉన్నాయి. వీరు " సామాజిక బంధాలు, ఆధ్యాత్మికత, ప్రకృతి, మతం, సత్యం వంటి విభిన్నమైన విషయాలను తీసుకొని హృద్యమైన పద్యాలను రచించారు.

వీరి కవితాధార నిరర్గళ రసప్రవాహఝరి. సుమధుర భావ విన్యాసంతో సరళమైన పదబంధాలతో సాగిన ఈకావ్యంలోని ప్రతిపద్యం ఒక ఆణిముత్యమే. అందరికీ తెలిసిన విషయాలనుకూడా అనూహ్యమైన అందంతో ఆవిష్కరించటమే కవి ప్రతిభకు నిదర్శనం. తమ కావ్యంలో అటువంటి ప్రతిభను కనపరచిన ఘనపాఠి–శ్రీచింతలపాటి.

"వ్యక్తిత్వం" అనే ఖండికలో రాముడు, భీష్ముడు మొదలగు మహాపురుషుల స్వభావాన్ని వర్ణిస్తూ ఆదర్శమైన వ్యక్తిత్వం ఎలా ఉండాలో సోదాహరణంగా , సాలంకారంగా వివరించారు.

"మతం" అనే ఖండికలో " సిద్ధాంతములనున్న భేదమొకటే చింతింపగా పండితుల్ " వంటి పద్యాలద్వారా నేటి సమాజానికి అవసరమైన మత సామరస్యాన్ని ప్రబోధించారు.

"మాగాణి" లో "అన్నమునిచ్చు భూమి మనుజావళికిమ్ముగ జీవమిచ్చి . . . " ఇత్యాది పద్యాలద్వారా భూమాతపట్ల, రైతులపట్ల మనం కృతజ్ఞులమై ఉండాలనే విషయాన్ని ఉత్తమ కావ్య లక్షణమైన ధ్వని రూపంగా తెలియజేశారు.

ఈవిధంగా సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అలంకారములు , ధ్వని, చమత్కారము వంటి ఉత్తమలక్షణాలతో సహృదయ హృదయంగమంగా "వాఙ్మయి"ని వెలయింపజేసిన సుకృతి శ్రీ మురళీకృష్ణగారు.

వీరు మరిన్ని సాహితీకుసుమాలను రసజ్ఞలోకానికి అందించాలని, భగవంతుడు వారికట్టి శక్తిని అనుగ్రహించాలని ఆకాంక్షిస్తున్నాను.

సుధీవిధేయుడు ,
(రా. వేం. కామేశ్వర శర్మ)
రాయప్రోలు వేకట కామేశ్వర శర్మ

కొవ్వూరు,
5 ,జనవరి, 2024.

శ్రీ:

"భాషాప్రవీణ" మచిలీపట్నం,

మద్దూరి రామమోహనరావు., 4-1-2024

ఎం.ఏ., ఎం.ఇడి.,

అభిప్రాయము

"ఇద మంధం తమ: కృత్స్నం జాయేత భువనత్రయమ్
యది శబ్దాహ్వయం జ్యోతి: ఆ సంసారం న దీప్యతే "

– ఆచార్య దండి.

శబ్దం అంటే వేదం. తొలివాక్కు. పరమాత్మ సంబంధమైన జ్ఞానం, ఓంకారం. వాగర్థాలే పార్వతీపరమేశ్వరులు. వాగర్థాల సమూహమే వాఙ్మయం. వాఙ్మయి అంటే సరస్వతి. అట్టి వాఙ్మయీదేవతను ఉపాసించి, తద్వారా ఓంకారంలో లీనమైపోవటమే మానవుడి కర్తవ్యం. ముఖ్యంగా కవులకు ఇదే అనుసరణీయమైన విధానం. వారు ఆ మార్గంలో వెళ్తూ పాఠకుల్నికూడా తీసుకొని వెళ్తారు. ఆదికవియైన వాల్మీకినుంచి ప్రారంభమై , కాళిదాసాదులచేత కొనసాగించబడిన ఈ వాఙ్మయోపాసన ఈనాటికీ కవులకు ఆదర్శప్రాయంగా నిలిచింది.

ఈ "వాఙ్మయి" ఖండకావ్యకర్త మిత్రులు శ్రీ మురళీకృష్ణగారు కావ్యంయొక్క బాహ్యరూపమేదైనా అంతర్లీనంగా సరస్వత్యారాధనే ఈ "వాఙ్మయి"లో భాసిస్తున్నది. ఇందులో పదునైదు శీర్షికలున్నాయి. మొదటి ఖండికలో కవి సరస్వతిని తన హృదయపీఠికపైకి ఆహ్వానించి స్థాపించుకున్నారు. అమ్మ కరుణాకటాక్షం ఉంటే ఏ విషయం కళ్ళ ఎదుట స్పష్టంగా కనిపించదు? కవియొక్క పూర్వజన్మ సుకృతాన్నిబట్టి లభించే అతనియొక్క ప్రతిభా వ్యుత్పత్తులమేరకు ఆ దర్శనం లభిస్తుంది. అందువల్ల మానవాళికి మేలు ఒనగూడుతుంది.

ఈ కావ్యంలోని ప్రతి ఖండికలోను పద్యరచనలో ధారాశుద్ధి , చెప్పదలచిన విషయంలో సూటిదనం, ప్రస్ఫుటమౌతున్నాయి. కవి లోకజ్ఞుడు. కావ్యప్రయోజనాన్ని సాధించటంలో "వాఙ్మయి" సఫలమౌతుందని ఆశిస్తున్నాను.

– మద్దూరి రామమోహనరావు

ఇందులో శీర్షికలు . . . . . .

వాఙ్మయి (ఖండకావ్యము)

1. వాఙ్మయి

శా. శ్రీకారమ్మును ముందునిల్పి కవితాసింహాసనమ్మందు ని
న్నే కూర్చుండగ బిల్చుచుంటి నిట వాణీ ప్రీతిమై వెంటనే
నాకై వచ్చి మనోరథమ్మిడుము విజ్ఞానార్థినై కోరితిన్
నీ కళ్యాణరసప్రపూర్ణ పదసాన్నిధ్యమ్ము నెవ్వేళలన్ 1

వాఙ్మయి అంటే వాక్కులమయమైనది. సరస్వతి. ఆ తల్లిని ఆహ్వానిస్తూ ఒకసింహాసనాన్ని చూపిస్తున్నాను. దానిముందు శ్రీకారాన్ని నిలిపాను. ఎందుకంటే మన సంప్రదాయంలో శ్రీచక్రం ఉంది. అమ్మవారు శ్రీచక్రసింహాసిని. కనుక ఆ తల్లివచ్చి ప్రీతితో ఆ సింహాసనాన్ని అధిష్ఠించి పాఠకుని మనోరథాన్ని తీర్చమని కోరుతున్నాను. విజ్ఞానార్థినై నేను ఆ తల్లిపాదాలవద్ద ఉండాలని కోరుకొంటున్నాను.

ఉ . కమ్మని పద్యకల్పనము కావ్యసుధామయసంభృతమ్ము ; ని
క్కమ్ముగ నీ ప్రసన్నరసకాంక్షయె నా హృదయానుభూతిలో
తెమ్మెరల ప్రవాహము యథేచ్ఛ చెలంగగజేసి భావముల్
క్రమ్ముకొనంగ తీర్చును; సరాగములాడును శబ్దసంగతుల్ 2

కమ్మనిపద్యం అనేది అమృతమయమైన కావ్యాలను సృష్టిస్తుంది. ఆ కావ్యాలను చదివితే మనస్సుకు ఆనందం కలుగుతుంది. సంతోషకరమైన భావాలు అలలు అలలుగా మనసులో ప్రవేశిస్తాయి. ఆ కావ్యంలోని శబ్దాలు మనస్సును ఊగులాడ జేస్తాయి. ఊహలతో సరసాలాడతాయి.

శా . అమ్మా! శారద నీ కరుణాకటాక్షములతో నత్యంత సంస్కారినై
సమ్మాన్యమ్మగు బుద్ధినొందెదను; భాషావేశమున్ పొంది లే
శమ్మున్ గర్వములేక శాస్త్రసమితిన్ సర్వమ్మునున్గ్రోలుచున్
సమ్మానమ్మున నిన్ను లో దలతు నీ సాన్నిధ్యమున్ పొందగన్ 3

శారదాదేవి కరుణాకటాక్షాలవల్ల ప్రతివ్యక్తికీ సంస్కారం కలుగుతుంది. గౌరవనీయమైనబుద్ధి కలుగుతుంది. భాషావేశం కలిగి, అహంకారం నశించి సర్వశాస్త్రాలను చదివే వీలు కలుగుతుంది. ఆ సరస్వతీదేవి అనుగ్రహం కలిగితే మనస్సు ప్రశాంతిని పొందుతుంది.

శా . తల్లీ నిన్ను దలంచి కావ్యముల సంధానించి వర్ణించుచో
నుల్లాసంబొదవున్ గదా జనని! యత్యుత్సాహ భావాబ్ధిలో
త్వల్లీలన్ తలపోసి మేను మరతున్ వాంఛాఫలంబెల్ల వి
ద్యుల్లేశమ్ముగ నీవెయిచ్చెదవు సంతోషమ్ము గల్పించుచున్ 4

ద్యారంభంలో సరస్వతీదేవిని ప్రార్థించి చదవటం మొదలుపెడితే మనస్సు సాధువవుతుంది. చదివి నది బుఱ్ఱకెక్కుతుంది. మనస్సు పరిణతిని చెందుతుంది. ఏం కావాలని ఆశించి చదువుతున్నావో ఆ ఆశయం నెరవేరుతుంది. సంతోషం, ఉత్సాహం కలుగుతాయి. తెలివివృద్ధి అవుతుంది

మ . తొలినాడబ్జభవుండు సృష్టి సలుపన్ తొల్దొల్తగా నిన్ను లో
దలచెన్ మార్గముజూపుమంచు; ఋజువిద్యాశీలమే భావి మే
లొలయించున్; కడుసూక్ష్మకారణము లాలోచించి నైపుణ్యమున్
విలసిల్లంగ ననుగ్రహించును; ప్రజాభీష్టమ్మునున్ గూర్చెడిన్ 5

పరబ్రహ్మ మొట్టమొదటగా సృష్టికార్యం ప్రారంభించటానికిముందు మనస్సులో సరస్వతీదేవిని తలచుకున్నాడు. సృష్టి ఎలాచేయాలో తెలుపుమనికోరాడు. ఆయనకు ఆతల్లి తెలివిని ప్రసాదించింది. చేయవలసినపని సులువుగా చేసే చార్గం చూపించింది. ఆయన సృష్టికర్త అయ్యాడు.

చం. మనిషికి బుద్ధియే వరము; మాన్యతగూర్చును విద్య యొక్కటే !
కనుగొనలేనివారు ధనకాంక్షను పైకొని లక్ష్మిగోరి వి
ద్యను కడనుంచగోరెదరు; దైన్యముమాత్రము దక్కు వారికిన్
ఘనయశమింతయైన కనకంపు సిరుల్ లవమైన దక్కునే ! 6

మనిషి అన్నవాడికి బుద్ధి ఉండటం ఒకలక్షణం.దానివల్లనే మనుషులకు గౌరవం కలుగుతుంది. అది తెలియక ప్రతివారు ధనాశతో ధనం ఉంటే చాలుననుకొని విద్యనుప్రక్కనబెడతారు. అలాంటి వారికి కోరికలు తీరవు.వారు ఎప్పుడూ నిరాశకే గురియవుతుంటారు. వారికి సంపదలు దక్కవు.

ఉ . మానవజన్మమెత్తి పరమాణుబలంబగుమేథనొంది లో
కాన మనోజవమ్మున సుఖమ్మునుపొందు రహస్యమింతటిన్
కానగలేని మూర్ఖుని ప్రకారము నేమనవచ్చు? శారదా
వీనికి నీదృగంచల సుభిక్షత గల్గిన మేలుగల్గదే? 7

మనిషిగాపుట్టి అద్భుతమైనబుద్ధినిపొంది దానిచేత సుఖపడవలసినవాళ్ళు అసలు రహస్యం తెలియక బుద్ధిహీనులైపోతున్నారు. సరస్వతీదేవి అనుగ్రహంలేనిదే సుఖాలు కల్గవని వాళ్ళు తెలుసుకోలేకపోతున్నారు. ఆ తల్లి దయయుంటేనే ఎవరికైనా సుభిక్షత(గొప్పసంపద) కలుగుతుంది.

ఉ . తల్లివినీవు ; పుట్టుక నుదారతతో తగుబుద్ధినిచ్చి జా
బిల్లినిదాకు శాస్త్రపరివృద్ధి నొసంగి యథేచ్ఛనేగు వి
ద్యుల్లతవంటి శక్తినిడి తోడుగ వాక్కులనిచ్చి మేలు మా
కెల్లెడ కల్గజేయుచు రహింపవె వాణి! మనోభివాదముల్! 8

అమ్మా! శారదా! నీవు మాకు తల్లివి. పుట్టుకతోనే మాకు కావలసినంత బుద్ధినిచ్చి, ఆకాశాన్నితాకే శాస్త్రపరిజ్ఞానాన్నిచ్చి, మేం అనుకున్నట్లుగా వ్యవహరించగల మెరుపువంటి చురుకుదనాన్నిచ్చి, వీటికి తోడు కావలసినంతశక్తిని, చక్కగా మాట్లాడగల వాక్కును ఇచ్చి ఎక్కడైనా మేం ప్రకాశించేలా చేయవే!

శా . వాగ్దేవీ భవదీయదృగ్విషయ శోభాశ్లేషమున్నంత స
మ్యగ్దీపావళి కాంతిపుంజములు సంభావించి మా యూహలున్
దిగ్దేశంబుల రమ్యవాగ్ఝరిగ నుద్దీపించి వర్తిల్లగా
దిగ్దంతుల్ ఘనవేదపాఠముల నుత్తేజమ్మునన్ నల్కెడిన్ 9

అమ్మా వాగ్దేవీ! నీ చల్లనిదృష్టి మా యందుంటే దీపావళి వెలుగులవంటి కాంతి సమూహం మా ఊహలలో ప్రవేశించి ప్రపంచమంతటా గొప్ప వాక్ప్రవాహంగా మాభాషను వ్యాపింపజేస్తుందని దిగ్దంతులవంటి పండితులు ఘన, జటవంటి వేదపాఠాలతో నిన్ను సేవిస్తున్నారు.

శా . విశ్వమ్మంతయు వాఙ్మయోద్భవము విశ్వేశుండు వాగ్దేవతా
శశ్వత్కాంతుల లీనమౌచు సృజనోత్సాహమ్ము రూపించు లో
కైశ్వర్యమ్మును వాగ్విలాస గరిమన్ హత్తించి శోభిల్లు; వా
గ్విశ్వమ్మే ధనలక్ష్మి భూషణము; సాక్షీభూతమీ లోకమే !! 10

వాఙ్మయి అనుగ్రహంవల్లనే ఈ సృష్టిఅంతా యేర్పడింది. పరబ్రహ్మ ఆ అమ్మవారి అనుగ్రహకిరణాలవల్లనే ఉత్సాహాన్నిపొంది సృష్టికార్యాన్నిచేశాడు. ఆ తల్లిదయచేతనే లోకులకు ఐశ్వర్యం, మాటకారితనం, లభిస్తాయి. ఈ ప్రపంచంలో ధనలక్ష్మి అంటే వాగ్దేవతయే. అందుకుసాక్ష్యం ఈలోకమే.

సీ . ఇరువురిమధ్యలో నిరకాటమునుబెట్టి

తీటతీర్చును మనమాట తీరు

మంచివాడను కీర్తి మానితమ్ముగ గూర్చి

మర్యాదపెంచును మాట తీరు

పాండిత్యమదియేమొ పదిమందికిని జెప్పి

మన్నింపజేయును మాట తీరు

పాపపుణ్యఫలాల భాగ్యవిశేషమ్ము

తేటపరచును నోటి మాట తీరు

తే .గీ . తెలివితేటలదీధితుల్ తెలియబరచు

నట్టి దృష్టాంత మది మాట యగునుగాన

మాటతల్లిని గమనించి నోటబట్టి

పలుకవలయును తొందరపడుట వలదు ‼ 11

మనం మాట్లాడేతీరువల్ల ఇరువురిమధ్యలో ఇరకాటం కలుగుతూ ఉంటుంది. అలాగే మంచివాడనే గుర్తింపుకూడా కలుగుతుంది. నీపాండిత్యమేమో నీ మాటవల్లనే తెలుస్తుంది. పాప పుణ్యాల వరుస కూడా మాటలోనే తెలుస్తుంది. మనతెలివికి నిదర్శనం మనమాటయే. కనుక మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలి.

తే .గీ . మాట కలహింపజేయు సయ్యాటగూర్చు

మనసు పులకింపజేయును మనగజేయు

మాట మరణమ్మెయౌ నవమాన మొసగు

మాటయే స్వర్గతుల్యమ్ము మానవులకు ! 12

మాటలవలన కలహాలు కలుగుతాయి. మంచిస్నేహం కుదిరినాకూడా నోటిమాట వల్లనే. మాట వల్లనే దుర్గతికాని, సద్గతి కాని కలుగుతాయి. నోటిమాటయే కష్టాన్నికాని , సుఖాన్నికాని ఇస్తుంది.

2. వాగీశా

శా . సృష్టి స్రష్టవు ధాతవీవు; సుమనస్సిద్ధార్థ భాగ్యమ్ము నీ
యిష్టమ్మై, తనరారు; బ్రహ్మవఖిలాండేశుండవై జీవులం
దిష్టాయిష్టములన్ రచించు విధివై జన్మన్ మృతిన్ గూర్చుచున్
స్పష్టంబై పలురేఖలొత్తెదవు మా ఫాలప్రభావమ్ముగన్ 1

ఈ సృష్టినంతటినీ సృజించిన బ్రహ్మవునీవు. దేవతలకు , సిద్ధిపొందినవారికీ కావాల్సినవి ఈయటం నీకు ఇష్టం. సమస్త ప్రపంచానికీ నాయకుడవై జీవులకు ఇష్టానిష్టాలను అనుగ్రహించే దేవుడవు నీవు. జీవులచావుపుట్టుకలను కర్మఫలాన్నీ వారి నుదుట వ్రాసే విదాతవు నీవు. నీకు నమస్కారమయ్యా

మ . భువనమ్ముల్ సృజియించి జీవగణమున్ పొల్పొంద రూపించి వై
భవ శిల్పాకృతులన్ రచించి కళలింపారంగ చిత్రించి మా
నవ లోకమ్మును దేవలోకముగ సన్మానించి విజ్ఞాన బం
ధువువై నీ వలరారుచుంటి విల నీతో సాటి లేరెవ్వరున్ 2

నీవు సమస్త లోకాలనుసృష్టించావు. జీవగణాలను పుట్టించావు. కలలను రూపొందించావు. మానవ లోకం-దేవలోకం భేదాలను రచించావు. మాకు వైజ్ఞానిక శక్తినిచ్చావు. నీకుసాటి ఎవరూ లేరయ్యా

శా . నీవేరీతి లిఖింతువో యదియె మా నిక్కంపుభాగ్యమ్ము; కా
నీ వర్ధిల్లగజేయుమా యనుచు నిన్ ప్రార్థించినన్ జాలితో
చేవన్ జూపుచు దిద్దబూనెదవొ! ప్రాచీకర్మమైనంచు మా
త్రోవన్ బొమ్మని త్రోసివేయుదువొ! యెంతోకొంత మేల్ సేయుమా! 3

విధాతా! నీవు మా నుదుట ఎలా వ్రాస్తే అలా జరుగుతుంది. కానీ మమ్మల్ని వృద్ధిలోకి రానిమ్మని నిన్ను ప్రార్థిస్తే సరిచేస్తావా? మేం ఇంతకుముందు చేసిన కర్మ అని త్రోసివేస్తావా? మేలుచేయవయ్యా

ఉ . బ్రహ్మపదార్థమున్ తెలియువారలు లోకమునందు యోగులే
జిహ్మముగాని బుద్ధిగలజీవులు గల్గిరె లోకమందు నీ
బ్రహ్మమనంగ దైవమనుభావము విజ్ఞులుతెల్పుచుండు యం
బ్రహ్మలెరుంగలేరు బగవంతుని నిన్ గనుభాగ్యమీయరా! 4

బ్రహ్మతత్వం తెలిసినవాళ్ళు యోగులే. జిహ్మము(వంకర)లేని బుద్ధిగలజీవులు

లోకంలో ఉంటారా! బ్రహ్మంఅంటే దైవం అని తెలిసినవాళ్ళు చెబుతారు. తెలియనివాళ్ళు(యంబ్రహ్మలు)ఎలాగూ బ్రహ్మను తెలుసుకోలేరు. అయినా మాలాంటి వాళ్లకు నిన్ను తెలుసుకొనే తెలివినీయరా!

ఉ . ఆదునికమ్ములైన యవలక్షణముల్ గ్రహియించినావొ! మా
సాధనలన్ని నీకడన సత్తువనీగి నశించుచుండె గా
నీ ధనధాన్యసంపదలు నీ కడనున్నవె? మా కుబేరులే
యోధులు నీకు పెట్టుబడులొయ్యన నొత్తుచు గ్రుమ్మరింపగన్! 5

బ్రహ్మదేవుడా! నీవుకూడా మాకన్నా ఎక్కువగా అవలక్షణాలను నేర్చుకొన్నావా? మేంచేసే కుతంత్రాలేవీ నీవద్ద పనిచేయటంలేదు. అయినా ధనధాన్యాది సంపదలు నీకులేవు కదయ్యా! మాలో సంపన్నులైన కుబేరునిలాంటివాళ్ళున్నారు. కావాలంటే నీకే పెట్టుబడులు పెట్టగలరయ్యా!

ఉ . ఇన్నివిధాలజీవులను యెట్లు సృజించుచునుంటివయ్య! మే
మెన్నికుయుక్తులన్ బనుప నింతకుమించుచు పై కుయుక్తిగా
పన్నిదమొడ్డి మమ్ములను బానిసలట్లుగ జేసివైచి నీ
వన్నిటిలో జయించెదవు యంతిమజీవనయాత్రలందునన్ 6

బ్రహ్మదేవుడా! నువ్వు ఇన్నిరకాలజీవుల్ని ఎలా సృష్టిస్తున్నావయ్యా! మేం ఎన్ని కుయుక్తుల్ని పన్నినా వాటన్నిటికీ పైయెత్తులుపన్ని మమ్మల్ని బానిసల్ని చేసేస్తున్నావు. చివరికి మా అంతిమయాత్రలోకూడా నీవే పైచేయి సాధించి మా జీవన విజేతవు నీవే అనిపించుకుంటున్నావు.

మ . నుదుటన్ కర్మఫలమ్ములవ్రాసి యెటులౌనో వీని వృత్తాంత మిం
పొదవన్ జూచెద నాటకంబనుచు మా భోగంబులన్ జూచుచున్
హృదయంబందున సంతసించెదవు నీ కే బాధలున్ లేవు; సం
పద నీ కైవసమయ్యె నింక కొదవా వైచిత్రికిన్ బ్రహ్మయా! 7

బ్రహ్మయ్యా ! మా నుదుట మా కర్మఫలాన్నివ్రాసి వీడి ప్రవర్తన ఎలా ఉంటుందో ఒక నాటకంలాగ చూద్దామని, సంతోషపడుతుంటావు. మేం నానా తిప్పలు పడుతుంటే నీకేబాధలూ ఉండవు . మా దగ్గరకంటే గొప్పసంపదలు నీ చేతిలోనే పెట్టుకున్నావు. నీకేం తక్కువయ్యా! చిత్రం చూస్తావు.

మ . జగమే నాటకరంగమౌను; జనమే చైతన్యమై పాత్రముల్
జగడమ్ముల్ జతగూడుటల్ సతము సంసారానురాగమ్ములున్
వెగటౌబుద్దుల తన్నులాట లుసురుల్ వీడ్కోనునందాక

నె

వెగటౌబుద్దుల తన్నులాట లుసురుల్ వీడ్కోనునందాక నె
వ్వగలేలా సృజియింతు వియ్యెడల నోయీ బ్రహ్మదేవా! ధరన్ 8

ఈలోకమంతా ఒకరంగస్థలం. జీవులందరూ కదిలేపాత్రలు. వీరిలో వీరికి తగవులు. కలయికలు. చనిపోయేవరకు కొట్లాటలు- ఎందుకయ్యా ఇలా కల్పిస్తావు?

శా . ఇంటింటన్ గల గాథలొండొకటి వేరేరీతిగా దోచు న
ట్లంటన్ నీకెటుచేతనయ్యెను మహోల్లాసమ్ముగా సత్కవుల్
గంటంబూని రచించు కావ్యములుగా కైపేయు నేర్పన్న నో
రంటన్ నిల్చిన శారదాంబ ఘనకార్యమ్మే యగున్ చూడగన్ 9

బ్రహ్మయ్యా! ఇంటికొక కత ఏర్పడేట్లుగా - ఒకదానికీ ఇంకొకటి సరిపోనట్లుగా కల్పించటం నీకెలా చేతనైనదయ్యా! ఒకవేళ కవుల కావ్యకల్పన చూసి నేర్చుకున్నావా అనుకుంటే నీ నోటవెలిసిన శారద నీకు అండగా ఉండగా ఇవన్నీ నీకెందుకయ్యా?

శా . లోకంబంతట విస్తరించినది యాలోకింపగా బ్రహ్మమై
నే కోశమ్మున బ్రహ్మతత్త్వమొక సాహిత్యమ్ముగాదోచు నం
దేకాంతమ్ముగ యోగవిద్యనరయన్ దీపించు బ్రహ్మమ్ము: జీ
వా కన్నార కనుంగొనన్ జగమె కైవల్యమ్మునన్ దోచెడిన్ 10

బ్రహ్మయ్యా! ఏదో అమాయకంగా అనుకోవటమేగానీ ఈలోకమంతా వ్యాపించి ఉన్నది బ్రహ్మమే కాదా? లోకంలో ఉన్న పంచకోశాల్లో ఎక్కడ చూసినా బ్రహ్మతత్త్వమే కనిపిస్తుంది. ఇది రకరకాల సాహిత్యంగా కనిపిస్తుంది. అందులో ప్రశాంతంగా చూస్తే యోగవిద్య బ్రహ్మాన్ని చూపిస్తుంది కదా! కన్నుకలిగిచూస్తే ఈలోకమే కైవల్యంగా కనిపిస్తుంది. ఇక్కడే స్వర్గం మోక్షం అన్నీ ఉన్నాయి.

శా . వేదాంతమ్మునకర్థమెవ్వడు? జగద్విఖ్యాత శక్త్యుక్తు లా
మోదించున్ పురుషుండటంచు ధరనేపుణ్యాత్మునిన్! వేనిచే
వాదమ్ముల్ సమసించి శాంతిగొను నా బ్రహ్మానుభావమ్ము సం
పాదింపన్ వలె దర్శనమ్ముగ మనోభావాంతరంగమ్మునన్1 11

అయ్యా! వేదాంతానికి అర్థమైన వారెవరయ్యా! ఈలోకంలో శక్తి, యుక్తి, అన్నిటినీ ఇస్తూ తిరిగి తీసుకొనే పుణ్యాత్ముడెవరయ్యా! అన్నిరకాల వాదాలను శాంతింపజేసేదెవరయ్యా! అటువంటి బ్రహ్మను గమనించే అనుభవాన్ని సంపాదించుకోవాలి. మనోబావంలో బ్రహ్మను దర్శించాలి.

శా . వేదంబుల్ గొనియాడు నెవ్వనిని బావించున్ సదా ఆత్మలో
నాదంబుల్ నుతియించు నెవ్వనిని విజ్ఞానంబు తానెవ్వడో
మోదస్థాన మదెవ్వడో జగతి నున్మూలించు వాడెవ్వడో
ప్రాదేర్భావములేని బ్రహ్మమును నే భావింతు నాత్మమ్మునన్ 12

చతుర్వేదాలూ ఎవనిని కొనియాడుతున్నాయి? ఎల్లవేళలా ఎవరిని భావిస్తున్నాయి? సర్వనాదాలూ ఎవరిని స్తోత్రం చేస్తున్నాయి? ఆనందానికి మూలమైనవాడెవరు? చివరకు లోకాలను తనలో కలుపుకునేవాడెవరు? అసలు పుట్టుకయే లేని బ్రహ్మతత్వాన్ని నేను నా మనస్సులో ధ్యానిస్తాను.

సీ . నలుమొగంబులవాడు నాదవేదమయుండు
నలినసంభవుడు నన్నేలువాడు
సృష్టికర్తయతండు చిద్విలాసఘనుండు
సర్వజీవమయుండు శాశ్వతుండు
ఉపనిషత్పురుషుండు నుజ్జ్వలరూపుండు
నుత్తేజపరుడు మహోన్నతుండు
బ్రహ్మాండమండిత బ్రహ్మదేవుడతండు
భాసురవాగ్దేవి పతియతండు

తే .గీ . జీవకోటిని పుట్టింపజేయునతడు
యనుభవమ్మును లిఖియించు నబ్జభవుడు
మరలిపోనున్న సమయ నిర్మాత యతడు
కాలపురుషుడు బ్రహ్మ సంగాతగాడు!! 13

నాలుగుముఖాలు కలవాడు. ఓంకార ప్రణవనాదము, చతుర్వేదవైభవము గలవాడు. నన్ను పాలించేవాడు. బ్రహ్మదేవుడు.అతడుసృష్టి కర్త. చిదానందపురుషుడు. సర్వజీవులయందునునెలకొన్నవాడు.శాశ్వతమైనవాడు. ఉపనిషత్తులు పేర్కొంటున్న పరమపురుషుడు. కాంతిమంతుడు.చైతన్యవంతుడు. అన్నిటికన్నా గొప్పవాడు. బ్రహ్మాండమంతటా ప్రకాశించేవాడు. వెలుగులీనే సరస్వతీపతి. జీవకోటిని పుట్టించేవాడు. కర్మఫలాన్ని నొసట వ్రాసేవాడు. జీవి ఎప్పుడు ఈ లోకాన్ని వదలిపోవాలో ముందే వ్రాసినవిధాత. ఆయన సమయ నిర్మాత. కాలపురుషుడు. జీవులకు స్నేహితుడు (సంగాతకాడు) బ్రహ్మదేవుడు.

a a a

3. వారాహీ !

శా . శ్రీవారాహి! సమస్తదేవ వినుతా! శ్రీశక్తి సంశోభితా!
దేవారాతి విమర్దితా! సురనుతా! దేవాధిదేవాత్మికా!
సేవాభాగ్యమొసంగవే జనని! యాశీర్వాదమిప్పింపవే
యేవేళన్ కనుగొంచు కాచుకొనవే హేమాత రక్షింపవే! 1

శ్రీవారాహీదేవీ ! దేవతలందరిచేతను స్తుతించబడే జననీ! శక్తికి నిలయమైనదేవీ! రాక్షససంహారిణీ! దేవతలచే పొగడబడినతల్లీ! దేవతలందరకు అధిదేవతవైన మహాతల్లీ! నిన్ను సేవించుకొనే భాగ్యాన్ని ప్రసాదించవమ్మా! నీ ఆశీస్సులను అందించవమ్మా! ఎల్లవేళలా మమ్ము కనిపెట్టుకొని ఉండుతల్లీ !

శా . ఈలోకంబున దుండగీంద్రధికమై హేయంబుగా ధర్మ క
ల్లోలంబున్ బొనరించుచుండె గనవే లోకంబులన్ గాయవే
మేలుంగల్గగజేయుమంచు ప్రజలున్ మిన్నంటు తాపమ్ముతో
కాలాత్మున్ జపియించుచుండె కడుదు:ఖంబెల్ల పోనాడగన్ 2

అమ్మా! లోకంలో దుండగులు ఎక్కువై ధర్మహానిని చేస్తున్నారు. వారినుండి ధర్మాత్ములను కాపాడు. ప్రజలు తమదు:ఖాన్ని పోగొట్టుమని పరితపిస్తూ కాలస్వరూపుడైన భగవానుణ్ణి జపిస్తున్నారు తల్లీ!

ఉ . ఎట్టివిచేష్టలున్ సలుప నెవ్వరికైనను బుద్ధియొక్కటే
పుట్టువు మూలమై దనరు; పొల్పుగదానిని సంస్కరించినన్
పుట్టెడి దుర్మదంబడగి పుణ్యప్రవర్తన సంఘటిల్లు; మీ
దెట్టులనున్న యోచన సహించెడిరీతి వహించుగావునన్ 3

ఎవరైనా దుర్మార్గాలు చేస్తున్నారంటే దానికి కారణం వారిబుద్ధి వక్రించి ఉండటమే. దాన్ని సంస్క రిస్తే వాళ్లకుపుట్టిన దుర్బుద్ధి నశిస్తుంది. అప్పుడు వారు సన్మార్గులుగా మారుతారు. వారిలో ఓర్పు, సహనం చోటుచేసుకుంటాయి. సరియైన ఆలోచనావిధానం ఏర్పడుతుంది.

ఉ . కావున బుద్ధినిన్ గలుగు కశ్మలమంత నశించిపోవగా
నేవలనైన దుర్జనుల నింగితమున్ సవరించుమమ్మ! దు
ర్భావములెల్ల పోయి గుణవత్తరమైన వచోవిధాన స
ద్భావన లాత్మలో విరియ ధన్యులజేసి ప్రజాళిగాయవే! 4.

అందువలన ఎలాగైనా దుర్మతులబుద్ధిని సంస్కరించుమమ్మా! వారిలోని కశ్మలమంతా

తొలగిపోయే విధంగా మార్చి, వాళ్లలో చక్కగా మాట్లాడేపద్ధతిని , మంచి ఆలోచనా విధానాన్నీ కలిగించి ప్రజలను కాపాడవమ్మా! వారికి ఇంగితాన్ని కలిగించవమ్మా!

ఉ . పుట్టుకతోడబుట్టు చెడుబుద్ధులనెట్టుల మాన్పవచ్చు నీ
వట్టులమాన్పవమ్మ! ఋణమంతయు నీభువిలోనదీర్చుకొ
మ్మెట్టులనైన యంచు మము మేదినిపై జనియింపజేసినన్
తట్టుకొనంగలేదు భువి దైన్యతగూర్చక రక్షసేయవే! 5

పుట్టుకతోపుట్టినబుద్ధి పుడకలతోగానీపోదని సామెత ఉంది. కానీ జన్మనిచ్చిన తల్లివి కనుక ఆ చెడుబుద్ధుల్ని ఎలా మాన్పించాలో నీకు తెలుసు. ఆవిధంగా వారిలోని దుర్బుద్ధులను తొలగించవమ్మా! అలాకాకుండా మీ ఋణమంతా ఈభూమిమీద తీర్చుకోమని వదిలేస్తే ఈభూమి తట్టుకోలేదమ్మా! భూమాతకు దైన్యతను కలుగజేయకుండా అందరినీ రక్షించవమ్మా!

ఉ . పాపఫలానుభూతికి సభాస్థలి భూమిగ నిర్ణయించి పు
ణ్యోపకృతానుభూతికి వినోది దివమ్మని పేర్కొనంగ నా
పాప పరాగమౌ నరకబంధము నేలకుకూర్చిపెట్టి బా
ధా పరిణామ దైన్యతకు తావొనగూర్చుట ధర్మమౌనొకో! 6

పాపఫలాలను భూలోకంలో అనుభవించుమని, పుణ్యఫలాలను స్వర్గంలో అనుభవించమని ఏర్పాటుచేస్తే, అది ధర్మమేనా తల్లీఝ నేలను నరకంగా నీవే నిర్ణయిస్తావా అమ్మా!

శా . దుర్మార్గుల్ చెలరేగి సాధుజనసందోహమ్ము నేడ్పించగా
ధర్మగ్లాని విశృంఖలంబగుచు విస్తారమ్ముగా వ్యాప్తమై
నిర్మూలించును ధర్మమార్గమును; గానీ నీవు విచ్చేసినన్
కర్మంబంత నశించి ధర్మమయమై లోకాలు శాంతించెడిన్ 7

దుర్మార్గులు చెలరేగిపోతే సాధువులు బాధించబడతారు. ధర్మగ్లాని ఏర్పడుతుంది. క్రమంగా ధర్మ వినాశనం కలుగుతుంది. కానీ నీవు ఈ లోకంలో అవతరిస్తే ఆ పాపకర్మమంతా నశించి లోకాలు శాంతిని పొందుతాయి. కాబట్టి అలా ఈలోకంలో అవతరించు తల్లీ !

శా . పాహీయంచు భవత్పదాంబుజములన్ భద్రమ్ముగాపట్టి వా
రాహీ మమ్ములగావ గోరెదను; ఘోరంబయ్యెలోకాలు; నీ

సాహాయ్యమ్మును కోరుచుంటిమిట మా సంకల్పమీడేరగా

దేహీయంటిమి వేగమే తరలిరా! దేవ్యైక శక్తీశ్వరీ !! 8

అమ్మా! నీపాదాలను ఆశ్రయించి మమ్మల్ని కాపాడమని కోరుకుంటాను తల్లీ ! పాపపంకిలమై లోకాలు క్షీణించిపోతున్నాయి. నీ సహాయాన్నికోరుకుంటున్నామమ్మా! మా సంకల్పం తీరేవిధంగా నీవు వెంటనే తరలిరావమ్మా! నీవు దేవతలందరిలో ఏకైకశక్తిస్వరూపిణివికదా తల్లీ!

శా . నీ వే హేతువునన్ జనించితివొ గానీ తల్లి! యా హేతువే

భావింపన్ కొనసాగుచున్నదిట! కోపాగ్నిన్ రగుల్కొల్పి నా

డే వింతాకృతితో జనించితివొ నేడీవేళ నారూపుతో

నీవేవచ్చి దురాత్ములన్ చెనకవే నిత్యాగ్ని సంవేదితా! 9

అమ్మా!నీవు ఏకారణంచేత ఈరూపాన్ని ధరించావో ఇప్పటికీ ఆ కారణమే సంఘటిల్లుదున్నదమ్మా! ఆనాడు ఎలా కోపాగ్నితో రగిలిపోతూ విజృంభించావో ఇప్పుడుకూడా అలాగే అదేరూపుతో రావాల్సిన అవసరం వచ్చిందమ్మా! అలాగేవచ్చి దుర్మార్గుల్ని రూపుమాపవమ్మా!

శా . నిన్నున్ జూచిన దుష్టవర్తనలకున్ నీరౌనుదేహమ్ము; యా

పన్నుంగాచెడి నిన్నుజూచి మది నీ వాల్లభ్యమున్గాంచి నీ

కన్నన్ మించిన దిక్కు లేదనుచు వైక్లబ్యమ్ము పోవన్ రుజా

ఛ్ఛిన్నంబై సుజనాళి నిల్చునుగదే శ్రీశక్తిసంధాయినీ !! 10

తల్లీ!నిన్నుచూస్తే దుర్మార్గులకు దేహం నీరైపోతుంది.బాధల్లోఉన్నవాళ్లు నిన్నుచూసి, నీకన్నామించిన దిక్కులేదని, నీ సహాయంవల్లనే తమ కష్టాలు తొలగిపోతాయని, భావించి ఆ ఆశతో జీవిస్తారు

సీ . చండముండాసురుల్ చాలరన్నట్లుగా

చెలరేగు దనుజులీ నేలనిపుడు

మనిషి రక్తమెకాదు; మనుజులప్రాణముల్

కొనగోటమీటు దుర్జనుల గనుడు

నీతియమములెందు నిలువున గనరావు

నెవ్వగపాలౌట నిక్కమిపుడు

న్యాయమర్థింప నన్యాయమ్ము కబళించు

నోరుమెదపగరాని తీరు గనుడు

తే . గీ. స్వార్థలాభమ్ముగోరుచు సంచరించు
వ్యర్థజీవులు దేశప్రవర్థులగుచు
ధర్మచింతననణగార్చి మర్మమెరిగి
హద్దులేకచరింతు రాశాంతములను ! 11

ఆనాటి చండముండాసురులను మించిన రాక్షసులు ఈనాడు చెలరేగిపోతున్నారు. మనుషుల రక్తమే కాదు. ప్రాణాలనుకూడా కొనగోటితో మీటివైచే దుర్జనులు బయలుదేరారు. లోకంలో నీతినియమాలు లేవు.న్యాయం కోరితే అన్యాయం కబళించివేస్తోంది. నోరు మెదపకూడని రోజులొచ్చాయి. స్వార్థంతో సంచరించే వ్యర్థజీవులు పెరిగిపోయారు. ధర్మచింతనను అణచివేసే ఉపాయంతో దేశదేశాలలోను దుర్మార్గులు హద్దూపద్దూలేకుండా చెలరేగిపోతున్నారు.

శా . మీ కర్మంబని మిన్నకుండెదవొ పొమ్మీయంచు కాపాడెదో
లోకాలోకనజేసి ధర్మగతి నాలోకింతువో లేక యిం
తే కాలమ్మని చప్పరించెదవొ నీతిన్‌గూర్చి చింతించెదో
నీ కర్తవ్యము నీవె జూచుకొనవే నీతాతకా !భైరవీ! 12

తల్లీ! ఇంత జరుగుతున్నా మీఖర్మ అని మెదలక ఉంటావో! లేక ధర్మరక్షణకోసం ముందుకువస్తావో ఆలోచించు తల్లీ! అందరిలాగానే నీవుకూడా కాలమహిమ అని చప్పరిస్తావా? నీతిని నిలపాలని ముందుకు వస్తావా? నీకర్తవ్యం ఏమిటో నీవే ఆలోచించుకోతల్లీ!

4. అనుబంధాలు

శా . ఈదేహమ్మున బిన్నసంగతులు మన్నింపన్ సదా సిద్ధమై
నాదే లోకమటంచు లీనమయి యంతన్ శాశ్వతమ్మంచు నా
మోదించున్ గద జీవులందరిట! ప్రాముఖ్యమ్ము సర్వమ్ము జీ
వాదుల్ దేహమువీడ నేమగును? విశ్వాసమ్ముగోల్పోయెడిన్ ! 1

ఈ దేహానికి అనేక ఆశలుంటాయి. ఈ లోకమంతా నాదే.. ఈ వస్తువులన్నీ నావే అనిపిస్తాయి. ఇవన్నీ ఎప్పటికీ నావే అని, అన్నీ శాశ్వతమని అనిపిస్తాయి. కానీ ఇవన్నీ మనం దేహాన్నివిడిచి పోగానే ఏమవుతాయి? మనం అనుకున్న నమ్మకాలన్నీ ఏమవుతాయి?

శా . గాలిన్ మేడలుగట్టి యూహలోలయన్ కన్నెత్తి పైజూచుచున్
లీలామానుషవిగ్రహుండనని యుల్లేఖించుకొంచున్ సదా
వ్రేలాడున్! మదిలోని యూహల ఝరీవేలాతిరిక్తంబుగా
కాలమ్మే కబళించునంత కలలున్ కైలాసవాసమ్మగున్ 2

గాల్లో మేడలుకట్టి ఎన్నెన్నో ఆలోచనలతో నేనే దేవుణ్ణని ఊహించుకుంటూ పొంగిపోతూంటాము. కానీ ఈ ఊహా ప్రవాహాలన్నా గట్లేతెగి పొర్లేటట్లుగా కాలం నిన్ను కబళిస్తే కలలు కైలాసానికిపోతాయి.

ఉ . ఊపిరిగల్గు నాల్గుదినముల్ తనయంతటివాడు లే డనున్
ప్రాపు నశించి యెల్లెడల భంగము గన్పడ మన్నుజూచి సం
తాపమునొందు నెవ్వడయినన్ కొనసాగిన హెచ్చు; కుందినన్
భూపతనమ్మగున్ జనులబుద్ధివిశేషము లింతయేగదా ! 3

ప్రాణం ఉన్న నాలుగురోజులు నాఅంతవాడు లేడని విఱ్ఱవీగుతాం. కాలం ఎదురుతిరిగితే కళ్ళు నేలకు దిగి బాధపడతాం. ఎవరైనా ఇంతే. కలిసొస్తే హెచ్చు. దిగిపోతే లొచ్చు. మనుషులబుద్ధులింతేకదా

ఉ . కాలముతోడువచ్చిన సుకమ్మున కన్నులుగాంచలేక నా
పోలికనెవ్వడైన సరిపోయెడునా యని మిన్నుజూచు; నా
కాలము కాలదన్నిన నగాధములోబడి కాంచలేక నే
లీల బయల్పడంగలను లేశముగాపుడటంచు మ్రొక్కెడిన్ 4

కాలం కలిసొస్తే నాఅంతవాడులేడని కనుగాననిమైకంతో మిన్నుచూస్తాం. ఆ కాలమే కాలదన్నితే అగాధంలోపడి లేవలేక కాస్తంత కాపాడండిరా అని ఏడుస్తాము. ఇంతేకదా మనప్రతిభ !

ఉ . చేసిన కర్మపాకమున జీవుడుదేహమునొంది యందు సం
వాసముచేత కష్టసుఖవాప్తినిబొందుచు మిన్నకుండి యా
వాసనలన్ని దేమమునవర్తిలజేయుచు సంచితమ్ము నా
యాసముతోడ వెంటగొని యాతనతో పరలోకమేగెడిన్ **5**

జీవుడు కర్మవశంచేత ఈ దేహాన్నిధరించి దీనిలో ఉండటంవల్ల కష్టసుఖాల అనుభూతులను శరీరానికి అంటించి, సంపాదించుకున్న కర్మఫలాన్ని పరలోకానికిపోతూ వెంటతీసుకొనిపోతాడు.

ఉ . దేహమునందునుండిన విదేహుడు జీవుడు నాల్గునాళ్లకే
దేహులతో విరోధమును ధీవిభవమ్మున నెయ్యమూని సం
దేహములేక శాశ్వవిధేయము దేహమటంచునమ్మి యా
వాహనజేయు దుర్గుణ ప్రభావములన్ తనజీవితమ్మునన్ **6**

ఈ దేహంలోఉన్నజీవుడు ఎప్పటికీ స్వంతశరీరం కలవాడు కాదు.కానీ తెలుసుకోలేక పుట్టిన కొన్నాళ్లకే కొందరితో విరోధాన్నీ, ఇంకొందరితో స్నేహాన్నీ పొంది ఆ భావనతో క్రమంగా దుర్గుణాలపాలవుతాడు

శా . భూమిన్ పుట్టుపిపీలికమ్మొకటి సంబోధించు తానొక్కటే
యేమాత్రమ్ము గుణాతిశాయినని తానీధాత్రిలో లేనిచో
నేమౌనోగద లోకమంత యని సందేహించి విభ్రాంతితో
సామాన్యుల్ మదిలోన విస్తుపడ నిశ్వాసించు నాత్మోద్ధతిన్ **7**

భూమిమీదపుట్టిన చీమకూడా తానుమాత్రమే బుద్ధిమంతురాలనని, తానులేకపోతే లోకమంతా ఏమైపోతుందోనని, సామాన్యులు ఆశ్చర్యపడేట్లుగా అహంకారంతో అనుకుంటూ ఉంటుంది.

మ . ఒకదేహమ్మును నాశ్రయించి పలు హృద్యోదాత్త కార్యమ్ములన్
ప్రకటమ్మౌనటు లాచరించి బ్రతుకున్ పండించు యత్నమ్ములో
వికలమ్మౌనొకవేళ కొండొకట నుద్వేగాన సాధించు నిం
దొకడేదైనను నాత్మతొక్కటియె సంతోషమ్ము దుఃఖమ్ములున్ **8**

ఒకజీవి దేహాన్ని ఆశ్రయించుకొని మంచిపనులనేకంచేస్తూ ఉన్నప్పుడు ఒకవేళ ఏదైనా

అవాంతరం మీదపడినా బాధ పడదు. అలాంటివాళ్లకు సుఖదుఖాలు రెండూ సమానమే.

శా . నావాడీతడు; కాదు వీడు పరుడౌ; నాయంశతోబుట్టి వీ
డే వర్థిష్ణువుగా కులాభ్యుదయ నాడీవర్థనుండౌను; కా
దీ వంద్యుండు కులాంతకుండనుచు నెంతేవాదనన్ జేయుచున్
భావావేశమునొందువారలిట సంభవింపగా బంధులే? 9

వీడు నావాడు. కాదు పరుడు. నావాడు నా అంశతోపుట్టి నా వంశాన్ని ఉద్ధరిస్తాడు. పరుడు ఎంత గొప్పవాడైనా కులాంతకుడు అంటూ వాదించేవాళ్లు ఎవరికి బంధువులవుతారు?

ఉ . బంధువులెవ్వరీ ధరణి భ్రాతలు తాతలు తండ్రులెవ్వరో
యంధపతానబోవునెడ నడ్డగువారల బంధులంచు కి
ష్కింధను నున్నకోతిగణశేఖరులట్లుగ పిల్చుకొంచు మా
బంధువులందరంచు తనివార నుతించుట నాటకమ్మగున్ 10

ఈ లోకంలో బంధువులెవరు?ఎవరు తల్లిదండ్రులు?ఎవరు తాతలు?చీకట్లో పోయేవాళ్లు అడ్డంవచ్చినవాళ్లందర్నీ బంధువులుగా పిలుచుకున్నట్లు, కిష్కింధలో ఉండే కోతులన్నీ బంధువులుగా పిలుచుకున్నట్లు- ఇదంతా ఒక నాటకం.

సీ . అవసరార్థమ్ముగా నతికెడి బంధువుల్
యదితీరినంతనే యవల జనును
ఎప్పటి కెవరిలో యేపనిగల్గునో
యెరిగి బంధుత్వమ్ము నురపుజనులు
గొప్పవారునుకీర్తి నొప్పెడివారితో
బంధుత్వమును గోరువారు గలరు
ధనవంతులైనచో దగ్గరి బంధులై
తరచుగా దరిజేరువారు జనులు
తే. గీ . ఏప్రయోజనమునులేక నెవ్వరైన
బంధువుడనంచు దరిజేరువారు గారు
లాభమొనగూరునప్పుడే లౌల్యమెసగ
చేరుచుందురు బంధులన్ పేరుతోడ 11

అవసరంకోసం బంధుత్వాన్ని గుర్తుచేసుకొని- అది తీరగానే వదిలిపోతారు కొందరు. ఎప్పుడు ఎవరితో ఏ అవసరం వస్తుందో అనుకొని బంధుత్వాన్ని నిలుపుకునేవాళు కొందరు. గొప్పవారితో బంధుత్వం కలుపుకొనేవాళ్లు కొందరు. ధనవంతులైతే దగ్గరకుచేరేవాళ్లు కొందరు. ఏ ప్రయోజనమూ లేకపోతే ఎవ్వరూ దగ్గరకు రారు. అవసరం ఉంటేనే ఎవరైనా దగ్గర చేరుతారు.

చం . అవసరమున్నయంతవరకందరు బంధువు లద్ది తీరగా

నివతలివంక చూడరికనెవ్వరు; లోకులతీరుచూడగా

నెవరును వేరుగాదు; యవనిన్ ప్రతిచోట నిదే క్రమమ్ము సం

భవమగుచుండె దోషమును పాపమనన్ తగదోయి మానవా!12

అవసరం ఉన్నంతవరకు అందరూ బంధువులు. ఆ అవసరం తీరిపోతే ఆ బంధుత్వంకూడా దూరమైపోతుంది. ఇక ఎవరూ తలతిప్పికూడా చూడరు. లోకులతీరు అంతటా ఇలాగే ఉంది. ఈ విషయంలో ఎవరూ వేరేరకంగా ఉండరు. లోకంలో ప్రతిచోటా ఇదే వరుస జరుగుతూంటుంది. ఇందులో పాపపుణ్యాలకు చోటులేదు. ఇది లోకం తీరు.

చం . ఒకరనినంత ప్రేమయగు నింకొకరన్నను గిట్టదయ్యె న

మ్మకమగు నొక్కరన్న యనుమానము వేరొకరన్న! యేలనీ

రకమగు భేదభావములు? రచ్చయొనర్చిన లాభమేమి? -చి

వ్వకుగలమూలమేమి? యనుబంధములన్నియు మాయయౌనొకో! 13

లోకంలో ఒకరంటే మరొకరికి ప్రేమ కలుగుతుందిమింకొకరంటే గిట్టకపోతుంది. ఒకరిపై ఎందుకో ఎనలేనినమ్మకంఉంటుంది. ఇంకొకరిని చచ్చినా నమ్మరు. ఇటువంటివన్నీ ఎందుకు కలుగు తున్నాయి? ఇలా అభిమానానికీ, గిట్టకపోవటానికీ కారణాలేమిటి? అంతా పెద్దమాయ కాదా?

5. మాగాణం

మ . కనుచూపంతటిమేరయున్ హరితవిక్రాంతిన్ కనుంగొమ్ము; ప
చ్చని చేలన్ గమనింపగా ప్రకృతియే సర్వేశ్వరుండౌను; దా
పున దర్శింపగ నిల్చెనో యనగ సొంపున్‌దాల్చి కవ్వించు భా
మిని వోలెన్ నటియించుచున్ పిలచు నెమ్మిన్ గీతికల్ పాడుచున్ 1

కనుచూపుమేర కనిపించే ఆకుపచ్చని కాంతిని చూడు! ఆ పచ్చని పంటచేలను చూస్తే అందులో పరమాత్మ కనిపించటంలేదా? గాలికి తరంగాలుగా కదిలిపోతూన్న పైరు తలలపై నాట్యంచేస్తున్న భామినిలా ప్రకృతి నటిస్తూ స్నేహగీతాలతో పిలుస్తుంది

ఉ . మెల్లగపిల్ల తెమ్మెరలు మేకొని జోలలు పాడుచుండగా
నుల్లమునందు నూహలవి యూయలలూపగ సస్యలక్ష్మి మే
లుల్లసిలంగ నెందరికి నోదనమిచ్చి తరింపజేయునో
వెల్లడిజేయునట్లు ఫలవీర్యబలమ్మున నూగుచుండెడిన్ 2

నెమ్మదినెమ్మదిగావీస్తున్న పిల్లగాలులు హాయిగా జోలపాడుతున్నట్లు లేదూ! ఆ పాటలు వినలేని చెవులతో వింటూ ఊహలను ఊయలలూపుతుంటే కనిపించే సస్యలక్ష్మి ఎందరికో ఆహారాన్ని అందిస్తున్నానని చెబుతూ తన పంటబలాన్ని ప్రదర్శిస్తూ ఊగుతున్నట్లుగా ఉంది.

సీ . ఆకుపచ్చనివస్త్ర మమరగా ధరియించి
ఆకాశకంచుకమ్మువధరించి
మబ్బులకురుల సమ్మానించు మెఱపుల
నోజస్సుగలనింగి తేజమొసగ
వానధారలతోడ పాలు నిండించుచు
గర్భాన్నమును వండి కలిమినిచ్చి
కడుపునింపెడితల్లి కలకాలమునుబ్రోచు
కన్నతల్లిని మించు కల్పవల్లి

తే . గీ . ప్రాణదేహాలనిచ్చు మాగాణమయ్య
పిచ్చిమందులగొట్టి చంపించకయ్య
నీటితీరులనరికట్టి నీరసింప
జేయబోకయ్య ప్రాణాలు తీయకయ్య!! 3

ఆ హరితకన్య ఆకుపచ్చని వస్త్రాన్ని ధరించింది. ఆకాశమనే రవికను దాల్చింది. మబ్బులనే కురులను కాంతినింపే మెఱుపులతో అలంకరించుకొంది. వానధారలనే పాలతో పండిన గర్భాన్నాన్ని వండి పెడుతోంది. అందరికీ కడుపునింపే తల్లి , కలకాలం పోషించే తల్లి, మనకు ప్రాణాన్నీ , దేహాన్నీ అందించే మాగాణభూమి! దాన్ని పిచ్చిమందులతోను, నీ రందీయకను, నీరసింపజేయకయ్యా!

చం . తినుటకు తిండినిచ్చి మనదేహము నిల్పుటతోడ పాడితో
మనలను పోకునట్టి పశుమాన్యగణంబును బ్రోచుచుండె నిం
ధనమిడుచుండె జీవనవిధానము నందు పొలమ్ము! యెల్లరున్
మనగలమార్గమియ్యదిసుమా! మనయందరి కన్నపూర్ణరా! 4

పొలం లనేది మనకు తినతిండినిస్తోంది. మనదేహాన్ని నిలుపుకోటానికి అవసరమైన పాడినిచ్చే పశుగణాన్ని పోషిస్తోంది. మనకు కావాల్సిన ఇంధనాన్నిస్తోంది. మనజీవన విధానంలో వ్యవసాయం భాగమైంది. అధికజనాభాకు బ్రతుకుతెరువు చూపిస్తోంది. మనందరకు పంటభూమి అన్నపూర్ణ

ఉ . అన్నమునిచ్చుభూమి మనుజావళి కిమ్ముగ జీవమిచ్చి సం
పన్నత గూర్చి లోకమునువర్ధిలజేయుచునుండె; లేనిచో
నిన్నియుగాలనుండి యొకడేనియు నేటికి నిల్చియుండునో
మన్ననతోడి భాగ్యమిసుమంత గడింపగగల్గియుండునో! 5

పంటభూమి మనకు అన్నం పెడుతోంది. మనజీవనానికి ఆధారమైంది. మన ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడుతోంది. అదే లేకపోతే ఇన్నియుగాలుగా మనం బ్రతుకగలిగి ఉండేవాళ్లమా! ఈమాత్రం సంపాదనైనా గడించి ఉండేవాళ్లమా!

శా . మాగాణుల్ మనప్రాణవాయువును సమ్మానించి నింపున్ ప్రజా
యోగక్షేమముగోరి కర్బనపు వాయువ్యుద్గారముల్ గ్రోలి యీ
త్యాగాత్మీయతచేతనే మనుజులున్ తార్కొంచు మేలొందు గా
దా ! గారామగు నీ విధానము జగత్కల్యాణ పూర్ణమ్ముగున్ 6

మనపొలాలవల్లనే ప్రాణవాయూత్పత్తి అధికమౌతోంది. ప్రజాక్షేమంకోసం కర్బనపు వాయువును పంటపొలాల్లోని వృక్షాలు స్వీకరించి మనకు ప్రాణవాయువునిస్తున్నాయి. త్యాగంతోకూడిన ఈ ఆత్మీయతచేతనే మానవజాతికి మేలు కలుగుతోంది. ఇది జగత్కల్యాణానికి తోడ్పడుతుంది.

ఉ. పచ్చనిపైరగాలి కడుపార లభించిన మేలుగాదె యే

పొచ్చెముదాకబోదు; పరిపూర్ణమగున్ మనయాయువంత! నీ

సచ్చరితమ్మెరింగిన విశాలురు హాలికులే జగమ్మునన్

మెచ్చగబోలు వారినిల మేలుఘటించెడువారు గావునన్ 7

పచ్చనిపైరగాలి మనకు కడుపునిండుగా లభిస్తే అంతకంటే మనకు ఇంకేం మేలు కావాలి? దానివల్ల మనకు సంపూర్ణమైన ఆయుర్దాయం లభిస్తుంది. ఈ గొప్ప విశేషాన్ని గమనించినవారు రైతులే. లోకానికి వారు ఇంతగొప్పమేలు చేస్తున్నారు కనుక తప్పకుండా వారిని ప్రజలందరూ మెచ్చుకోవాలి.

ఉ. అల్లన నూచుగాలులకు హాయిగశీర్షములూపుచున్ ప్రవా

హొల్లసితమ్ముగా నలలహెూ నర్తించునట్లున్న పై

రెల్లెడ నూగుచున్ రసవరిష్ఠ ప్రసాదము పంచుచుండె మే

నల్లన నూపు నర్తకియనన్ జవరాలి విలాసమట్లుగన్ 8

అల్లనల్లనవీచే పిల్లగాలులకు హాయిగా తలలూపే పైరు వాయుప్రవాహానికి అనుకూలంగా శరీరాన్ని ఊపుతూ నాట్యంచేసే నర్తకి వయారం స్ఫురించేటట్లుగా కనిపించి రసప్రసాదం పంచుతోంది.

ఉ. పండినపంటచేల తల బంగరురంగును బూని దేవలో

కాండము సంభవించునను గాథ రచించుచు నున్నయట్లు భూ

మండలమంతటన్ సిరులు మానితమై రహియించునట్లు దే

వుండు ప్రసన్నరూపమున నుర్విని గ్రమ్మినయట్లుదోచెడిన్ 9

పంటపండినతరువాత పైరు ఉపరితలమంతా బంగారురంగుతో ఉంటుంది. అప్పుడది దేవలోకాన్ని గుర్తుచేస్తూ భూమండలమంతా లక్ష్మి తాండవించబోతోందని సూచిస్తుంది. బగవానుడు నేలంతా ఆక్రమించి దర్శనమిస్తున్నట్లు కనిపిస్తుంది.

ఉ. కోతలు పూర్తియైనతరి కుప్పలు చేల మినుంగులున్ పెసల్

ప్రీతిగ పంటనిచ్చునని పెట్టుబడుల్ వెదజల్లి యాశతో

రైతులు కాపుగాచెదరు; రంజిలు కాలము మేలుచేసినన్

భూతలమందు కాంచనవిభుత్వము గాంతురు వారలియ్యెడన్ 10

వరికోతలు పూర్తియైనతరువాత రైతులు కుప్పలు వేస్తారు. చేలలో మినుములుగానీ పెసలుగానీ చల్లుతారు. పురుగులబారినుండి ఆ రెండవపైరును కాపాడుకుంటారు. కాలం అనుకూలిస్తే బంగారం కురిపించే కాసులవర్షాన్ని పొందుతారు.

మ . హిమపాతమ్మున పూవుపిందెలడగున్ హేదేవుడా యంచు దు:
ఖముతో రైతులు క్రుంగుచుందు రయినన్ కర్తృత్వభోగమ్ము ఫా
లము నందుండుటచేత పంటఫలమున్ లక్షించినట్టై మహ
త్వము నందించును; సాగుబాధలవి జూదంబట్లు భేదించెడిన్! 11

రైతులపాలిట మంచుకష్టాలను తెస్తుంది. మంచు కురియటంవల్ల పైరు మాడిపోతుంది. దేవుడా అని అనుకూలవాతావరణం కోసం రైతులు ఎదురుచూస్తారు. అనుభవించే భాగ్యంఉంటే అనుకున్నట్లే పైర్లు బాగా ఫలించి రైతులచేతికి మహాలక్ష్మి అందుతుంది. సాగురైతుల కష్టాలు జూదం ఆడుతున్నట్లుగా ఉంటుంది. వారి లాభనష్టాలు దైవాధీనంగా ఉంటాయి. పండితే లాభం. ఎండితే నష్టంగా ఉంటాయి.

ఉ . వేసవి భూమి నెఱ్ఱెలయి వేడిమి నల్దెస పూని పంచుచున్
దోసములన్ని యావిరగు త్రోవనుజూపెడునట్టులుండుటన్
గ్రాసములేక చిక్కును సగమ్ము పసుల్ పటుపాలధారలన్
వీసములోన పాతిక లభించెడునట్లు గతించువేడికిన్ 12

వేసవి వచ్చిందంటే ఆ ఎండవేడికి భూమి బ్రద్దలయి నెఱలిచ్చి, కుళ్ళంతా ఆవిరైపోతుంది. పశువులకు మేత దొరక్క అవి చిక్కిశల్యమౌతాయి. పాడిబాగా తగ్గిపోతుంది. వీసంలో పాతిక లభించినట్లుగా ఉంటుంది వ్యవసాయం.

చం .తొలకరి వానజల్లులకు తొయ్యలి గర్భమునిండినట్లు నే
లలు కడుపారత్రాగి సవాలాసముగా పురుటింటివాసనల్
వెలువడునట్లు ధూమగతివేడుకలన్ ప్రసవించి నాట్లతో
కలకలలాడుచున్ నగుచు గారవమొప్ప హసించి మించెడిన్! 13

ఎండలకు ఎండీఎండీ ఉన్న నేలతల్లిపైన తొలకరిజల్లులు పడగానే కన్నెపిల్ల కడుపుపండి గర్భం ధరించినట్లు నేలలు కడుపార నీరుత్రాగి పురుటింటి వాసనల వంటి మట్టివాసనలతో పొగలు క్రక్కుతూ సంతోషాన్నిపంచుతూ నాట్లకు అనుకూలించి కళకళలాడుతూ మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

౮. గణ సంగతి

శా . ఈ సృష్టిన్ గలవెన్నియో గణము లన్నీ కోర్కెలంబూని య

న్యాసక్తిన్ భుజియింపనెంచి కడగండ్లన్ గూర్చి పీడించి సం

త్రాసమ్మున్ గలిగించి నెమ్మదిగ నుండన్ వీలులేనట్లు నీ

ర్ష్యా సంబోధితులై ప్రజావళిని నిత్యంబంటి వేధించెడిన్ 1

సృష్టిలో ఎన్నెన్నో గణసమూహాలున్నాయి. వాటికి ఎన్నో కోరికలుంటాయి. అందుకోసం ఇతరుల ఫలాలను భుజించాలని, వాళ్లను పీడించి భయపెట్టాలని, నెమ్మదిగా ఉండనీయరాదని కోరుకుంటాయి. అసూయతో ప్రజలను నిత్యమూ వేధిస్తుంటాయి.

మ . గణసంఘమ్ములు మానవాళి నిలదాకన్ వచ్చి పీడించి ఘ

ర్షణకై బూనినయట్లు నెల్లెడల విక్రాంతిన్ ప్రదర్శించి దూ

షణయే లక్ష్యమనంగ విఘ్నముల పాశంబల్లి దుర్మార్గ తో

షణతన్ తృప్తిగడించుచుండు నవి దోషాలెల్ల లెక్కించెడిన్ 2

ఈ గణసంఘాలు మనల్ని పీడిస్తూ అడుగడుగునా అడ్డుపడుతూ పనులు జరుగనీయకుండా దుర్మార్గంచేస్తూ తృప్తిని పొందుతాయి. అవి ఎప్పుడూ మన తప్పుల్ని లెక్కిస్తూ ఉంటాయి.

ఉ . వాటి నివారణమ్మునకు వైభవమొప్పగణేశు పూజచే

నూటిగతాకి యాగడ పశుత్వమునుక్కడగింప విఘ్నముల్

ధాటిగ నెట్టివేయబడి దర్పముజూపక నే గణమ్ములున్

చే టొనరింపకుండుటకు సిద్ధిగణాధిపు నెంచు డాత్మలో! 3

ఆ గణదోషాలనుఅడ్డుకోవటానికి మనం ప్రశాంతంగా గణపతి పూజలను చేస్తూ వాటి పశు ప్రవృత్తిని అనచగలుగుతాము. కనుక మనం ప్రతినిత్యము సిద్ధిగణపతిని తలుచుకుంటూ ఉంటే మంచిది.

చం . వివిధగణమ్ములార్చుచు నభీప్సితమిమ్మని గోలచేయుచున్

భువి చెరలాడుచుండు; సుఖభోగము లడ్డుచు కంటకమ్ములై

యవధులులేని యిక్కటుల నందరకున్ కలుగంగజేసి మా

నవులన్నుబాధపెట్టుపరిణామములన్ గమనించుడెయ్యెడన్ 4

మనకంటికి కనిపించకుండా మనచుట్టూ తిరుగుతూ వాటి కోరికలను తీర్చమని అనేక గణాలు గోలచేస్తూనే ఉంటాయి. మన సుఖాలకు అడ్డు పడుతూనే ఉంటాయి.

అంతులేని కష్టాలను మనకు కలిగిస్తూనే ఉంటాయి. మనల్ని బాధలకు గురిచేయటమే వాటి లక్షణం. అందువల్ల మనం మన అభివృద్ధికోసం వాటిని కనిపెట్టి అవి కలిగించే దక్షషాలను నివారించుకుంటూ ఉండాలి.

ఉ . ఏటికి నొక్కసారిగ గణేశుని పూజయొనర్చి విఘ్నముల్
చేటొనగూర్పరాదనుచు సిద్ధికి మ్రొక్కుచునున్నగాని యీ
పాటికి యింతయేలయని పైకొనివచ్చె కరోన! దీని నీ
బీటను ద్రుంచివేయగల వీరగణేశుని భక్తిగొల్చుడీ! 5

అందుకోసమే ఏడాదికి ఒకసారి గణేశుని పూజించి ఇటువంటి విఘ్నాలు కలుగకుండా చూడమని మనకు ఎవరికీ ఎటువంటి చేటు కలగరాదని, మనకు లాభం, కార్యసిద్ధి కలగాలని కోరుకుంటూ ఉంటాము. అయినా కరోనా వంటి మహామారి మనపై పడింది. ఇలాంటి ఉపద్రవాలు రాకూడదంటే మనం శ్రీగణేశుని పూజించాలి.

శా . ఏవో కొన్నిగణాలు మానవునిపై హింసాత్మకదృష్టితో
జీవమ్మున్ హరియించగా చెలగుచున్ ఛిద్రమ్ముజేయున్ ప్రజా
సేవాగారములన్నిటిన్ భయద రాశీభూత దౌర్జన్య ని
ర్జీవౌద్ధత్య విహారధోరణులతో క్రేంకారముల్ సల్పుచున్ 6

మనం ఎన్నిచేసినా కొన్ని దుష్టగణాలు మనపై హింసాత్మకదృష్టితో దాడిచేస్తూ, మన ప్రాణాలు హరిస్తూ , మనజీవితాలను నాశనంచేస్తూ ఉంటాయి. మానవుల మనుగడకు చేటు కలిగిస్తూ దౌర్జన్యపూరితంగా ప్రాణాలుతీసేవిధంగా క్రేంకారాలుచేస్తూ, విజృంభిస్తూ ఉంటాయి.

మ . గణసందోహమదంత నీశ్వరుని సంకల్పమ్మునందుండు; ని
ర్గుణ రుద్రాంశగణమ్ములున్ చెలగి యే కోశంబునందైన దు
ర్గుణ సంఘంబుననంచు; పార్వతి సుతున్ కూర్మిన్ తదధ్యక్షుండుగా
గణియించెన్ పరమాత్ముడీ భువిని తద్గాథల్ సుపర్వంబయెన్ 7

గణసమూహాలన్నీ పరమేశ్వరుని అధీనంలో ఉంటాయి. వాటిలో నిర్గుణ రుద్రగణాలు దుర్గుణగణాలను అణచివేస్తుంటాయి. అందుకనే పార్వతీతనయుణ్ణి పరమేశ్వరుడు గణపతిగా నియమించాడు.

ఉ . కోట్లజనావళిన్ దినెడి కూటవిషక్రిమి పుట్టుపూర్వముల్
వేట్లను గల్గెనో యనుచు వేలదలంపులమీద దైవమే
వీట్లనుగూర్చెనంచు నొకవింత ప్రవాదము వచ్చె; నెవ్వరే
దెట్లుయొనర్చినన్ ఫలితమివ్విధి నున్నది చేటుకాలమై ! 8

కోట్లాది జనాభాను పొట్టనుపెట్టుకున్న కరోనా పుట్టుపూర్వోత్తరాలగురించి చాలామంది చాలా వాదా లను తెచ్చారు. ఈవిషయమై కొంతమంది ఈశ్వరేచ్ఛవల్లనే ఈ క్రిమిపుట్టిఇందని ఒక వింతవాదాన్ని వ్యాపింపజేశారు. ఎవరేమన్నా మనకు చేటుకాలం దాపురించి ఫలితం అనుభవించాం కదా!

శా . అంటువ్యాధుల నాపలేము; జనసంఖ్యాధిక్యమై దేశమం
దుంటన్ కోరినరీతి సర్వజనసందోహమ్ము జృంభింప వె
న్వెంటన్ జొచ్చుచు రోగకారకము లన్నింటన్ ప్రవేశించు; ని
ట్లుంటన్ దీని నిరోధమెట్లగును? చేటున్ మాపుటేనాడగున్ 9

మనం అంటువ్యాధుల్ని ఆపలేము. జనాభా అధికమై తోచినట్లు తిరగటంవల్ల రోగాలు తంవరగా వ్యాపిస్తాయి. ఒకదాని తరువాత మరొక క్రిమి పుడుతూనే ఉంటుంది. నివారణకు ప్రజలు చైతన్యవంతులు కావాలి.

మ . గ్రహసంచారఫలమ్ము లోకమున ఘోరమ్మైన సంక్షోభమున్
సహియింపన్ జనరాని వేదనను నాశమ్మైన సంఘట్టనల్
బహుళమ్మౌ మరణమ్ములన్ బరపుచున్ భౌగోళికార్తివ్యథా
గ్రహభీభత్స పరిస్థితుల్ నెలకొనంగా జేసె కల్లోలమున్ 10

ప్రకృతివిపరీతాలు కేవలం ప్రజల అజాగ్రత్తవల్లనే జరుగుతాయనకూడదు. అన్నిటికీ మించి పైన గ్రహ సంచార ప్రభావం పూర్తిగా ప్రబావవంతమై ఉంటుంది. దానివల్ల ఘోరమైన సంక్షోభాలు కలుగుతూ ఉంటాయి. అధిక జననష్టం కలుగుతూ ఉంటుంది. వీటికి అదే ప్రధాన కారణం.

సీ . గణసంగతులు తృప్తి పడకున్నయెడలనే
గణియింపదగిన రోగాలు హెచ్చు
గణకూటములు మేలు గణియింపకున్ననే
గండరగండాలు గలుగుచుండు
గణసంఘటన కోపఘటనమ్మునొందినన్
గగనమౌ నీలోకగమనమెల్ల

గణఘర్షణలు తాపకారకమ్మైననే
గండకాలముదోచు జగములకును

తే .గీ . దేహములులేని గణములతృప్తికొరకు
దేహులా గణపతిని సంతృప్తిగొల్చి
సంకటములను బాయు డే వంకనైన
దీనరక్షకు గొల్చి జగాన మనుడు !! 11

గణసమూహాలు తృప్తి పడకపోతేనే చెప్పుకోదగ్గ కొత్తరోగాలు పుడతాయి . అష్టకష్టాలు కలుగుతాయి. జీవనం కష్టమౌతుంది. కాలం గండంగా మారుతుంది . దేహంలేని గణాల తృప్తికోసం గణపతిని సేవించాలి.

మ . ప్రకృతీరూపముదాల్చు పార్వతి శరీరాకారుడైనట్టి నా
యకునిన్ గొల్చిన విఘ్న సంఘటన లౌరాయంచు బర్వెత్తు; మీ
దకు రానేరవు; దుష్టవర్తనములన్ దప్పించి మౌనమ్ముగా
ప్రాకారమ్మును వీడిపోవు నెటకో భద్రమ్ము చేకూర్చుచున్ 12

ప్రకృతివిలయాలనుండి కాచుకోవటానికి ప్రకృతిస్వరూపిణియైన పార్వతీతనయుణ్ణి కొలిచినట్లైతే విఘ్నాలన్నీ పారిపోతాయి. మనకు భద్రత కలుగుతుంది. దుష్టచేష్టలన్నీ తొలగిపోతాయి.

ఉ . కాన గణేశు పర్వదిన గౌరవమొప్పగ నేడుకూడ స
మ్మానముగా గణేశుని సమంచితరీతిని పూజచేయుచున్
పూనిన నీ క్రిమిన్ దునిమి పుణ్యమొసంగుమటంచు గోరుచున్
ధ్యానమొనర్చినన్ తొలగు నాపదలన్నియు జాతికంతకున్ 13

అందువల్ల గణేశుని పండుగదినాన, విడిగా ఆపదలు ఘటిల్లినప్పుడుకూడా విఘ్నపతిని తగిన విధంగా పూజించినట్లైతే ఇటువంటి క్రిమికీటకాదుల పీడ తొలగిపోతుంది. మానవజాతికి సంభవించే ఆపద లన్నీ తొలగిపోతాయి

7. భ్రమరగీతికలు

మ . చెవిలోనన్ భ్రమరార్థగీతికలు నిశ్చేష్టన్ రచింపంగ తో
చవు వేరొండు సుయోచనమ్ములు సదా సంచారభావమ్ములే
రవళించున్ చెవులందు; నవ్విధమునన్ రాజిల్లు నాసక్తులున్
పవళించున్ మదిలోన మానసము నుత్పాతమ్మునన్ ముంచుచున్ 1

చెవిలో జోరీగలమోత వినిపిస్తుంటే ఏపనీ తోచదు. మనస్సు పూర్తిగా పరాకుతో పరధ్యాసగా ఉంటుంది రకరకాల పనికిరాని ఆలోచనలు, ఆసక్తులు, ప్రమాద భరితంగా మనస్సును ఆక్రమిస్తాయి.

శా . ఈ లోకాన సుఖాన నుంచెడిదియేమో యన్న నీ మానస
మ్మే! లోలత్వమునొందకుండ కుదురై మేధావిధానమ్ముతో
నాలోచించి చరింపజేసిన సుఖాభ్యాసమ్ముతోపాటు దై
వీ లాభమ్మును కూర్చి మోదమిడెడిన్ వేరొండు యోజింపకన్ 2

లోకంలో సుఖపడాలంటే తోడ్పడేది నీ మనస్సే. ప్రతిదానిపైన ఆసక్తిని చూపించకుండా తెలివితో ఆలోచించి ఆచరిస్తే సుఖము, దైవానుకూలము లభించి సంతోషం కలుగుతుంది.

శా . సర్వార్థమ్ముల మూలమై చెలగు నాశాపాశమున్ వీడి యా
యుర్విన్ బుద్ధి యవక్రమార్గ గతి నత్యుత్సాహియై బోవగా
పూర్వీకమ్మగు యోగవిద్య గనుచున్ పుణ్యానుశీలమ్మునన్
సర్వేశున్ భజియించుచున్ నడచుచో సంతోషమేపారెడిన్ 3

అన్ని వినాశనాలకు మూలం ఆశయే. బుద్ధి వక్రమార్గంలో పడిపోకుండా ఉండటానికి యోగవిద్యా ఉపాసన సంతోషాన్ని కలిగిస్తుంది. పుణ్యాన్నిస్తుంది. సన్మార్గంలో నడిపిస్తుంది.

శా . నీ కన్నుల్ గనునట్టిదెల్ల భ్రమయే! నీబుద్ధితో జూచినన్
ప్రాకామ్యమ్ముగ దైవమాయ విశదంబై నిల్చు నీముందటన్
సాకల్యమ్మగు నిట్టిశక్తి కలుగన్ సచ్ఛీలసంపన్నమౌ
నేకాగ్రస్థితమానసైకకుసుమమ్మే దారిజూపించెడిన్! 4

నిజానికి నువ్వు చూస్తున్నది యేదీ నిజంకాదు. అంతా మాయయే. దాని స్వరూపం తెలుసుకోవాలంటే నీ స్వంతబుద్ధిని ఉపయోగించుకోవాలి. నియమానుసారంగా

ధ్యానం చేయాలి. కొంతకాలానికి దైవమాయ అర్థమవుతుంది. మనసును ఏకాగ్రంగా నిలపగలిగితే అదే సరియైన దారినిచూపిస్తుంది. ఆ దారిలో నడిపిస్తుంది. కానీ బుద్ధి వక్రించకుండా నిలపటం చాలాకష్టం. దాన్ని సాధన చేయాలి. అప్పుడు ప్రయోజనం ఉంటుంది. జన్మసాఫల్యం లభిస్తుంది.

ఉ. నిశ్చలభావమూని గమనింపవలెన్ పరమాత్మరూపమున్
కశ్చిదనంతలోకముల కావల దివ్యపరంపర ద్యుతుల్
నిశ్చయమై వెలుంగు మహనీయ తపఃఫలపూర్ణసారమై
దుశ్చరితమ్ములన్నిటిని తూలగజేసెడి కాంతిపుంజమున్! 5

పరమాత్మ స్వరూపాన్ని నిశ్చలమైన ధ్యానయోగంద్వారా దర్శించాలి. ఆ పరమాత్మ కిరణప్రసారం అనంతలోకాలనుండి కొనసాగుతూ ఉంటుంది. అది తపఃఫలంవల్ల దర్శనీయమౌతుంది. ఆ కాంతి పుంజం పాపాలన్నిటినీ తొలగించి వేస్తుంది. అది నీ అంతరాత్మతో సహా అంతటా వ్యాపించి ఉంది.

ఉ. వేలగు వత్సరమ్ములు జపించినవారల తీరుజూచినన్
చాలవిచిత్రమౌ; యతులు సాధులు నిశ్చలచిత్తమూని దే
వాలయమట్లు దేహమున నాంతరదర్శనమొందుచున్ మహా
లీలలొనర్చు నీశ్వరుని లేశముగాంచగ నాశజెందెడిన్! 6

వేలసంవత్సరాలుగా జపించేవారినిచూస్తే చాలా చిత్రమౌతుంది.వారు ప్రశాంతచిత్తంతో దేహాంతరం లోనే పరమాత్మ దర్శనంపొందుతూ ఆయన లీలలను ఇంకా దర్శించాలని ఆశపడుతూ ఉంటారు.

శా. ఏ మౌనీశ్వరుడైన నీశ్వరుని యెందేనైన దర్శించుచో
నా మౌనీంద్రు మనోబలమ్మె ఋజువౌ! నద్దానిచే నాతడున్
సామాన్యున్ వలె దైవమున్ గనును వీసమ్మైన భేదమ్ము లే
దే మంత్రమ్మునుగాదు మానసమునందీశక్తి రాజిల్లెడిన్! 7

ఏ మునీశ్వరుడైనా పరమాత్మను దర్శించాడంటే అందుకు కారణం అతని మనోబలమే. ఆ శక్తిచేత అతడు సామాన్యుణ్ణి చూచినట్లే దైవాన్నీ చూడగలడు.

చం. సునిశితమైన బుద్ధి గుణశోభితమై లభియించుటొక్కటే
యొనరిన చాల దెట్లనిన యోగ్యతనెంచి మనస్సునిల్పి దే
వుని తనచిత్తమందు తలపోయుచు సన్నిహితమ్ము కాగ నెం
దున తపియించునో యతడు తోయజనేత్రుని జేరునెయ్యెడన్ 8

భగవానుని దర్శనం ఎలా లభిస్తుందంటే అందుకు బుద్ధి ఒక్కటే చాలదు. ముందుగా మనస్సును ఏకాగ్రతగా క్రోడీకరించుకోవాలి. దైవస్వరూపంగా తనకు నచ్చిన రూపాన్ని భావించుకోవాలి. ఆరూపం తనకు సన్నిహితంగా వస్తోందని అనుకోవాలి. తాను ఆ రూపానికీ, ఆ తత్త్వానికీ ఇంకా దగ్గరగా వెడుతున్నానని ఊహించుకోవాలి. పరమాత్ముడు తప్ప వేరే సంగతులేవీ అతని మనస్సులోకి రాకూడదు. ఆవిధంగా ఒక సమాధి స్థితిలో మాత్రమే జీవికి దైవదర్శనం కాగలదు.

చం . మనసొక రావియాకు మొన మాదిరిగా చెరలాడుచుండు దీ
నిని వశమందునుంచుకొని నిష్ఠురమైన సహించి కష్టమం
తను భరియించి శాశ్వత సుధామయుడౌ భగవానునందు దృ
ష్టిని లగియించి యోగవరసిద్ధి గడించినవాడె ముక్తుడౌ ! 9

మనస్సు రావియాకు మొనలాంటిది. గాలి లేకపోయినా అది కదులుతూనే ఉంటుంది. దాన్ని ఒకస్థాయిలో నిలపటం కష్టం. అందుకు అవాంతరాలు చాలా వస్తాయి. వాటన్నిటిని దృఢచిత్తంతో ఆవలకు త్రోసి అమేయ కాంతిస్వరూపుడైన భగవానునిపైసే దృష్టి నిలిపి సాధన చేయాలి. అప్పుడే సిద్ధి కలుగుతుంది.

చం . మనసును కట్టివేయగల మాన్యుడు లోకమునందు గల్గెనే
గొనకొని కట్టివేయునెడ కూరిమిమీరగ దేవదేవుడే
మనమునునిల్చి క్రొవ్వెలుగునిండిన మందిరమందు దివ్యభా
నునివలె కాంతిరేఖలను నూల్కొని నల్దిశబర్వజేసెడిన్ 10

మనసును కట్టివేయగలవాడు లోకంలో ఉన్నాడా? అలాంటివాడు ఉంటే ఆ దేవదేవుడే తనంత తాను దిగివచ్చి మనస్సులో కొలువుండి దివ్యభాస్కరునివలె కాంతిరేఖల్ని ప్రసరిస్తాడు.

చం . మనుజుల కర్మలన్నిటికి మానసమే తగమూలకారణం
బని వివరింతు రియ్యెడల మన్ననసెంచక కోరినట్లు పో
యిన ఫలితమ్మదేమి? తుది నేమగు? దీనిని పొందునప్పుడై
నను గమనించి యేడ్చెదరు నశ్వరవాంఛ గడంగునంతటన్ 11

మానవుల కర్మలన్నిటికీ అతని మనస్సే మూలకారణం. దాన్ని స్వేచ్ఛగా పోనిస్తే కర్మభ్రష్టుడవుతాడు. అప్పటికైనా గమనిస్తే అశాశ్వతమైన వాంఛలకు లోనైన ఫలితాన్నిగురించి బాధ పడతారు.

సీ . అర్థమనస్కత నర్చించి రావణుం

డా మహాశివుని యాదరమునందె

ఏడి నీహరియంచు నీర్ష్యను గ్రక్కుచు

నా హిరణ్యాక్షుండు నదిరుపడెను

దుర్భాషలన్ కృష్ణు దూషించి శిశుపాలు

డసువులబాసె నా డుసురుమనుచు

చంపసిద్ధమ్మైనచక్రి దేవుడటంచు

పొగడిన భీష్ముండు పుణ్యమొందె

తే. గీ. ఇట్టిచేష్టల నొనరించి నట్టివారి

మానసమ్మిట్లు కదలాడి మసలెనట్లు

నింతకును ఫలమరసిన నెల్లయెడల

మనసు కవ్వింతగాక యేమనెదవయ్య !! 12

రావణుడు అర్థమనస్కుడై మహాశివుని యర్చించి గౌరవాన్ని పొందాడు. ప్రహ్లాదుణ్ణి ప్రశ్నిస్తూ హిరణ్యాక్షుడు అదిరిపడి నశించాడు. శ్రీకృష్ణుణ్ణి నిందించి శిశుపాలుడు ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. తనను చంప వచ్చిన శ్రీకృష్ణుడు పరమాత్ముడని నమస్కరించిన భీష్ముడు పుణ్యవంతు డయ్యాడు. వీరంతా తమ మనస్థితినిబట్టి ఫలితాన్ని పొందారు. ఇది మనస్సుయొక్క కవ్వింతకాక ఇంకేమిటి?

చం . మనసును నిగ్రహించుకొని మన్ననలొందిన మేలుగాని పో

యిన కడదాక పేవునెడ నింతచరిత్ర యసహ్యమౌను కా

వున గమనించి జీవితము నుత్తమ మార్గమునన్ చరింప జే

సిన పరమేశ్వరున్ గని ప్రసిద్ధిని పొందగలారు ధారుణిన్! 13

ఎవరైనా సరే మనస్సును నిగ్రమించుకొని సాధనచేస్తే ప్రయోజనం ఉంటుంది గాని మనస్సు పోయినంత వరకు కోరికలకు లోబడి నడిస్తే చరిత్ర అసహ్యమౌతుంది. అది తెలుసుకొని ఉత్తమ మార్గంలో నడవాలి. అప్పుడు పరమేశ్వరుని దర్శించగలుగుతారు. ప్రసిద్ధిని పొందగలుగుతారు.

8. ప్రకృతి

చం. నినుగను మాతృభూమి యనునిత్యము దప్పికతీర్చు గంగ చే
తనగలిగించు వాయువు సదా జఠరాగ్నినిబూడ్చు యన్నమున్
మనసుకుహాయి నిచ్చెడి సుమమ్ములు పక్షులు జంతుజాలమున్
కనుగొన నంతయున్ ప్రకృతి ! కాంచుము ఆకసమంటు కల్పనన్ 1

నిన్నుకన్న నీ మాతృభూమి, నీవు కోరినప్పుడు దప్పికతీర్చే గంగాదేవి అంటే నీరు, నీకు చైతన్నాన్ని కలిగించే వాయువు, నీ ఆకలినితీర్చే అన్నము, నీ మనసుకు హాయినిచ్చే పుష్పాలు, పక్షులు, జంతువులు ఇంకా నీ కంటికి కనిపించే సమస్తమూ, నీవు కల్పించుకునే కల్పనలు, అన్నీ కూడా ప్రకృతియే.

ఉ . పుట్టువునుండి నీ బ్రతుకు భూమిని సాగెడియంతకాలమున్
గట్టిగ కౌగలించుకొను కాంత సుమీ ప్రకృతీలలామ; యే
పట్టున తోడునీడవలె పన్నుగతోడ్పడు కన్నతల్లియై
గుట్టుగ నంతరంగమును గూడి సుఖింపగజేయు నెల్లెడన్ 2

నీవు పుట్టినప్పటినుండి ఈ భూమిపై నీ బ్రతుకుయాత్ర నడిచినంతవరకు నిన్ను గట్టిగా కౌగలించుకొనే కాంత ప్రకృతి. ఎటువంటి పరిస్థితులోను నీకు తోడు నీడగా సహాయపడుతూ కన్నతల్లి మాదిరిగా నిన్నుసుఖపెట్టే కన్నతల్లి ప్రకృతి.

చం . ప్రకృతిఫలమ్ములందరికి ప్రీతియొనర్చును; సంతసించినన్
సకలజగమ్ము సంతసిలు; సొరు నశించి విలాపమొందినన్
ముకుళితులై ప్రజావళియు మోదమడంగి కృశించు దీనతన్
పకపకలాడినన్ పగల వైరమణంచిన దిక్కు యిద్దియే ! 3

ప్రకృతియిచ్చే ఫలితాలు అందరికీ తృప్తినిస్తాయి. నీవు సంతోషిస్తే అన్ని లోకాలు సంతోషిస్తున్నట్లుంటాయి. నీవు బాధపడితే లోకాలన్నీ నీతోపాటు దిగిలుపడుతున్నట్లుంటాయి. అలాగే ప్రకృతి నిరుత్సాహంగా ఉంటే ప్రజలూ నిరుత్సాహంగానే ఉంటారు. ప్రకృతి సంతోషంగా ఉంటే ప్రజలవైరం అణగిపోతుంది

మ . ఋతువాసంతికజూచి సంభ్రమముతో రెట్టించు నుత్సాహ సం
గతి నుల్లాసము నొందు; గ్రీష్మసమితిన్ కళ్యాణ సంరంభ స
మ్మతియౌ ! వర్షమునొంద నీరొదవి కామ్యార్థమ్ము రూపొంది పా
ర్వతి పర్వమ్ముల పండుచున్ మకరసంక్రాంతిన్ ప్రపుణ్యమ్మగున్ 4

వసంత ఋతువును చూస్తే ప్రతివారికీ మనస్సులో ఉత్సాహం రెట్టింపు అవుతుంది. ప్రకృతి ఎలా పులకిస్తుందో అలాగే ప్రతి మనిషి హృదయమూ పులకలెత్తుతుంది. క్రొత్త ఆలోచనలతో ఉరకలు వేస్తుంది. అలాగే గ్రీష్మ ఋతువులో శుభకార్యాసక్తితో లోకమంతా ఉత్సాహంగా పరుగులిడుతుంది. వర్ష ఋతువులో ఆశలు నీరుపోసుకొని గణపతి నవరాత్రులు దాటి ఆవించిన పంటలఫలితాన్ని అందుకొని మకరసంక్రాంతికి పుణ్యవంతమౌతుంది.

మ. మరుజన్మమ్మునకాదిమూలమిదియై మన్నించి జీవింపగా

వనరుల్ జూపి యొసంగి నీదనుచు నిస్స్వార్థమ్ముగానిచ్చి వీ

డని బంధమ్మున గన్నతల్లివలె వేడ్కన్ పాలనన్ జేయు భా

మినియౌ నీ ప్రకృతీమతల్లి సకలమ్మీతల్లియే యిచ్చెడిన్ 5

మనశరీరానికి ఆదిమూలం ప్రకృతియే. మనం జీవించటానికి అవసరమైన ఆధారాలను చూపించి ఇవన్నీ నీవే అనుభవించుమని నిస్వార్థంగా ఇస్తున్నది ప్రకృతి. మనతో వీడని అనుబంధాన్ని పెనవైచుకొని ఉంది. కన్నతల్లివలె సమస్తమూ మనకిచ్చి మనలను పోషిస్తున్నది యీ ప్రకృతియే

చం . ప్రకృతిదృశ్యముల్ కనులపండువు సేయును; హాయి నిచ్చుచున్

ప్రకట మనోనురంజన ప్రభావమొసంగును; తృప్తి తీరగా

సకలకళామతల్లియును సద్విభవమ్మునుపూని జీవ కో

టికి తగు నాశ్రయమ్మిడి పటిష్ఠ నివాసము గూర్చుచుండెడిన్ 6

ప్రకృతిదృశ్యాలు మనకంటికి పండుగచేస్తాయి. వాటిని చూస్తే మనకు హాయి కలుగుతుంది. మన మనస్సును అవి రంజింపజేస్తాయి. మనలోని సకలకళా విలాసాలను ప్రకృతి ఉద్దీపింపచేస్తుంది. మన ఆటపాటలన్నిటికీ కేంద్రస్థానం ప్రకృతియేకదా!

చం . కనులనుజూచునట్టిది యఖండముగా పరమాత్మరూపమే

మనమునగాంచలేక పరమాత్ముడు వేరొకచోటనుండె నా

తని గనిపెట్టు కార్యమున తత్పరతన్ కృషిచేయుచుంటి మే

మని వచియించువారు నణుమాత్రము దీని గ్రహింపరేమయా! 7

మనం చూసే ప్రకృతి పరమాత్మరూపమే. మనం గ్రహించలేక దేవుడు వేరేచోట ఉన్నాడని వెతుకుతున్నాం. కానీ అణుమాత్రమైనా ఈరహస్యాన్ని గ్రహించటంలేదు.

చం . మనలను గన్నతల్లి పరమాత్మునిలోగల యాదిశక్తి; యా
మెను గమనింపుడీ ప్రకృతిమేను ధరించిన కల్పవల్లిగా!
కనుగొన దేవుడేడి యను కౌతుకులీ ప్రకృతిస్వరూపమున్
గని యిది మాతృరూపమని గాంచిన దేవుడు తండ్రి యయ్యెడిన్ 8

మనలను కన్నతల్లి ఈ ప్రకృతి. ఇది పరమాత్మునిలో అంతర్లీనమై ఉన్న ఆదిశక్తి. మనం ఈమెను గ్రహించాలి. దైవాన్వేషణ చేసేవారు ప్రకృతిని తల్లిగా తెలుసుకొంటే దేవుడు తండ్రియౌతాడు.

ఉ . నిత్యము చూచుచున్న వరణీయ గుణాన్వితయైన లోకమున్
సత్యమటంచు నమ్మకుము; సత్యము శాశ్వతమైన దేవుడే
ప్రత్యయ మూలకారణము; పన్నగ వానినియాశ్రయించు నీ
మృత్యుసమేతయౌ ప్రకృతి మేదిని! యియ్యది మాయరూపమౌ! 9

మనం నిత్యం చూస్తున్న ఈ లోకం యథార్థమైనది కాదు. దేవుడే శాశ్వతమైనవాడు. ఈ లోకం మృత్యువుతో కూడినది. ఇది మాయాస్వరూపం మాత్రమే.

ఉ . చూచెడివన్నియున్ మిగుల చోద్యమొసంగును; శాశ్వతమ్ముగా
తోచవు యెవ్వియున్ మనకు తోపగజేయు యథార్థమౌ గతిన్
యీ చలియించు లోకమున నీవు పిపీలికవయ్యు శాశ్వత
మ్మై చరియించునట్లు యనుమానములేక చరింతువేమిరా! 10

ప్రకృతిలో మనం చూసేవన్నీ మనకు వింతగొలుపుతూ ఉంటాయి. అవేవీ శాశ్వతం కావని మనకు తెలుస్తూనే ఉంటుంది. ఈ చరాచర ప్రకృతిలో మనం చీమలవంటివాళ్లం. అయినా ఎల్లకాలం ఉండే వాళ్లమని భ్రమలో బ్రతుకుతున్నాం.

సీ . నాలుగునాళ్లుండి నశియించి పోదువు
నడమంత్రమేలరా నరుడ నీకు!
గాలివానలు క్రుమ్మి కూలునట్లుగజేయ
భయకంపమొందెడి బ్రతుకునీది!
ఊపిరిన్ బిగబట్టు నున్మాదక్రిమిచేత
నుసురుబాసెడి సూక్ష్మయోద్ధవీవు
సాగినంత చరించి సాగనియెడగూలు
సంత్రాసజీవివి శౌర్యమేల?

తే . గీ . నిన్నుబుట్టించు దైవమ్ము నెఱుగలేక
లేడులేడంచు తెగనాడు వాడవేమి?
కంటిముందటి ప్రకృతిన్ గాంచునెడల
తల్లి కనిపించు! దానిలో తండ్రి గలడు!! 11

ఏదో నాలుగురోజులు ఈ భూమ్మీద ఉండి పోయేవాడివి ఓ మనిషీ ! నీకెందుకయ్యా ఈ నడమంత్రపు సిరి! గట్టిగా గాలివాన వస్తే భయపడి చచ్చేబ్రతుకునీది. ఊపిరిని బిగబట్టిన కరోనా చేతిలో గిలగిలలాడిన బ్రతుకు నీది. సాగితే నీయంతవాడు లేడంటావు. సాగకపోతే చతికిలబడతావు. నిన్ను పుట్టించినదేవుణ్ణి తెలుసుకోలేవు. పైగా వాడు లేనేలేడని తెగనాడుతావు. కంటిముందున్న ప్రకృతిని చూసి దానిలో తల్లిని చూడలేవు. దానిలోనే తండ్రి ఉన్నాడని తెలుసుకోలేవు.

శా . ఈ బ్రహ్మాండమదంత యీశ్వరుని రూపేయంచు గుర్తించలే
వే! బ్రహ్మవిష్ణువులెవ్వరీ జగతి లేనేలేరు పొమ్మంచు నే
తి బ్రహ్మమ్మను వాదఘోషణముతో తీర్పిచ్చు మూఢాత్ములన్
సుబ్రహ్మణ్యులు కూలద్రోచెదరో! కాసుల్ బొంది హర్షింతురో? 12

ఈ బ్రహ్మాండమంతా భగవంతుని రూపమే అని తెలుసుకోలేక పోతున్నావు. త్రిమూర్తులు లేనేలేరని మానవుడే దేవుడనే అహంభావంతో సంచరిస్తున్నావు. గొప్ప ధర్మపరులు అధర్మపరులను నశింపచేస్తారా?. ధనాశతో విడచిపెడతారా?.

ఉ . బుద్ధిని గల్గువారు కనుమూసి జపింపుడు; కంటిముందు మీ
బుద్ధికి గానుపించు పరమోత్తమ శక్తిని గూర్చి లేశమున్
శుద్ధమనమ్ముతో గనుడు; శోధనజేసిన దేవదేవుడే
శ్రద్ధగ కానిపించును దిశాంత విశాలము వానిరూపమౌ! 13

బుద్ధిమంతులు కళ్ళు మూసుకొని ధ్యానంచేస్తే మీ కళ్ళముందు పరమాత్ముని శక్తి స్వరూపం కనిపిస్తుంది. అందులో ఏకాగ్రత ఉండాలి. చంచలస్వబావం ఉంటే ఫలితం ఉండదు. నీవు ఎంత శ్రద్ధగా ధ్యానిస్తే పరమాత్ముడు అంత ప్రేమగా దర్శనమిస్తాడు. ఆయన రూపం దిక్కులవ్యాప్తి కలది.

n n n

9. మతం

చం . మతమది యిష్టతన్ జనెడిమార్గము; యందున మంచిచెడ్డలన్
హితవొనగూడునట్లు గమనించి చనందగుగాని మూర్ఖులై
జతయగుచో వినాశనము సంఘటిలున్ ! గతమౌ చరిత్రయే
ప్రతియుగసాక్ష్యమౌను; ప్రతివారలు యోచనజేసి సాగుడీ ! 1

మతం అంటే ఇష్టం అని అర్థం. ఎవరికి ఇష్టమైన జీవనవిధానంలో వారు జీవించటమే మతం . అటువంటి మతవిధానాన్ని ముందుగా గమనించుకొని ఎంచుకోవాలి. అలాకాక మూర్ఖంగా మతాలను ఎన్నుకొంటే వినాశనం కలుగుతుంది. గతచరిత్రయే ఇందుకు తార్కాణం.

మ . గతకాలమ్మున ఛాందసుల్ మతమునే ఖడ్గమ్ముగా దూసి దు
ర్మతినో సమ్మతిచేతనో మతము మారండంచు పీడించి యు
న్నతమైనట్టిది మా మత మ్మిదియె విజ్ఞానాబ్ధియౌనంచు ను
ద్ధతి జూపించెడితీరు మూర్ఖతకు యాథార్థ్యంపు సాక్ష్యమ్ముగున్ 2

ఇదివరకటి రోజుల్లో పట్టుదలగలవారు మతాన్ని ఒక కత్తిలా దూసి సదాలోచనతోనో లేక దురాలోచనతోనో ప్రజలను మతం మారమంటూ నానాబాధలూపెట్టి మా మతవే గొప్పదంటూ, అది చాలా మంచిదంటూ ప్రచారంచేస్తూ, అహంకారంచూపిస్తూ , బలప్రయోగం చేయటం తెలివితక్కువతనానికి నిలువెత్తు సాక్ష్యం.

మ . మతధర్మమ్ములు శాంతి మంత్రములు నీమంబొప్పగా జెప్పి స
మ్మతితోడన్ పరమాత్మజేరు విధమున్ మౌనోపదేశమ్ముచే
హితవౌనట్లు వచించి మేల్ పథము జూపించున్ పురోగాములై
ప్రతివారున్ జనునట్లు ! వేర్పరచు దుర్భావాలు దోషమ్మగున్ 3

ప్రతివారికీ మతధర్మాలనేవి శాంతిమంత్రాలుగా నీతిని బోధించి మౌనోపదేశంతో పరమాత్ముణ్ణి చేరేమార్గాన్ని చూపించి ప్రజలకు మేలుచేయాలి. అంతేగానీ ప్రజలమధ్య

శా . సిద్ధాంతమ్ములనున్నభేదమొకటే చింతింపగా పండితుల్
రాద్ధాంతమ్ముల సేయకుండిన జనారాధ్యున్ ప్రపూజించు వా
రిద్ధాత్రిన్ భజియించు తోచినటు లా రీతిన్ విమర్శింపగా
యుద్ధమ్ముల్ చెలరేగుచుండె ధరలో నుద్రేకముల్ పొంగగన్ 4

మతవిషయికమైన సిద్ధాంతభేదాలతో పండితులు పనికిమాలిన రాద్ధాంతాలు

చేయకుండా ఉంటే, ప్రజలు తమకుతోచినట్లుగా భగవానుణ్ణి పూజించుకొనేవారు. అలాకాక విమర్శలు ఎక్కువకావటంతో ప్రజలలో ఉద్రేకాలు పెరిగి యుద్ధాలకు సిద్ధమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవే ప్రజలలో చీలికలకు దారితీస్తున్నాయి .

శా . యావద్ధాత్రికి భారతావనియె వేదాంతమ్ము నేర్పించి యెం
తో వైశిష్ట్యమొసంగె మానసిక విద్యోపాసనా రీతికిన్
జీవన్ముక్తి విశేష సంగతులకున్ చిత్తానుకంపాది సం
సేవోద్యోగ విభిన్న వాదములకున్ చిత్తైకమూలమ్ముగన్ 5

మొత్తం ప్రపంచానికి భారతభూమి వేదాంతాన్ని నేర్పించింది. ప్రజల మానసిక వికాసానికి , జీవన్ముక్తికి సామాజిక సహజీవనానికి అనేక అంశాలలో తోడ్పడింది

శా . పూర్వర్షుల్ కడు భక్తిమీరునటులన్ పూజించె నే విగ్రహం
బార్షస్థానములందు నర్చనల నే భంగిన్ ప్రపూజించె నా
ర్షర్షుల్ కానలకేగి విగ్రహములారాధించిరే మున్ను ను
త్కర్షింపన్ గుడి విగ్రహాల నిలుపన్ తర్కించె నెవ్వారలున్ 6

పూజనీయ స్థానాలంటూ ఏర్పాటుచేసి మన పూర్వఋషులు భక్తితో ఏరకమైన విగ్రహాలను నెలకొల్పారు? ఏవిధమైన పూజాక్రమాన్ని ఏర్పాటుచేశారు? వారు ఆ రోజుల్లో వానప్రస్థానికి వెళ్లి అక్కడ ఎలాంటి విగ్రహాలను పూజించారు? గుడులను ఎవరికోసం నిర్మింపజేశారు?

శా . వానప్రస్థముబోయి దైవజపమున్ వర్ధిల్లగాజేయు వా
రానా డెల్లరు; విగ్రహాలయెదుటన్ రంజిల్లుపూజాది య
ర్చా నీకమ్మొనరించువార లెవరైనన్ గల్గిరే? కాని మిం
దూ నిష్ఠాపరులన్ గురించి జగముల్ దోషాలు వల్లించెడిన్ 7

ఆ రోజుల్లో అందరూ వృద్ధాప్యంలో వాపప్రస్థానికి వెళ్లేవారు. నియమంతో జపం చేసుకొనేవారు. అంతేకానీ అక్కడ విగ్రహాలు పెట్టుకొని పూజలు చేసిన వారు కాదు. అయినా హిందువులు విగ్రహారాధనచేసేవారని మిగిలిన జాతులవారు తప్పు లెన్నారు.

శా . అర్వాచీనులు విగ్రహాలనిడి దేవారాధనల్ దీర్పగా
సర్వమ్మందున నున్నదైవమిచటే సంధిల్లెనా యంచు నీ
యుర్విన్ కొందరు వాదులాడుటలు యెంతో హేతుబద్ధమ్ము; యీ
పర్వమ్మందున మంత్రశక్తి గమనింపన్ బోలు నెవ్వారికిన్ 8

ఈరోజుల్లో చాలామంది విగ్రహారాధనను విమర్శిస్తున్నారు. దేవుడు ఈ విగ్రహం లోనే ఉన్నాడా? సర్వవ్యాపకుణ్ణి విగ్రహంలోనే చూపిస్తారా అని వాదులాడుతున్నారు. అది నిజమే. పూర్వం తెలిసినవారెవరూ అలా చేయలేదు. వారు మంత్రశక్తిని, మాన సిక ఏకాగ్రతను విశ్వసించారు.

మ . శిలయే దైవమటన్న దోషమగు; వాసింగాంచు మంత్రస్ఫుట
మ్ముల బీజాక్షర సంపుటీకరణచే మూలాత్మకమ్మైన శ
క్తి లతల్ మోసులువారు నియ్యెడల భక్తిన్ పూజలన్ చేసినన్
విలలో దైవికశక్తి నిల్చి ప్రజకాశీర్వాద మిచ్చున్ గదా! 9

నిజానికి శిలయే దేవుడంటే దోషమేకదా! అక్కడ అది శిలయే అయినా బీజాక్షరాలతో మంత్ర స్ఫుటంచేసి యంత్రస్థాపనచేసి సంపుటీకరణం చేయటంవల్ల శక్తి అందులో నిక్షిప్తం చేయబడింది. అటువంటి దాన్ని భక్తిశ్రద్ధలతో పూజించటం వలన దైవశక్తి అక్కడ కేంద్రీకృతమై భక్తులను ఆశీర్వదిస్తోంది.

ఉ . విగ్రహమందు శక్తి యొకవేళను లేదని విశ్వసించుచో
నిగ్రహశక్తిగల్గు నొకనిన్ బిలిపింపుము; వానిచేత నీ
విగ్రహమున్ దొలంచి తగు వేడుక నొందుడు; పూర్వమెందరో
యాగ్రహమూని జేసిరిటు నావలస్రుక్కె; చరిత్రచూడుమా! 10

ఒకవేళ విగ్రహాల్లో శక్తి లేదని విశ్వసించారనుకోండి ! దండితనంగలవాణ్ణొకణ్ణి పిలవండి. వాడిచేత ఒక విగ్రహాన్ని తొలగింపజేయండి. ఆ మా యని వేడుక పొందండి. పూర్వం ఎంతోమంది ఇలా చేశారు. ఆ తరువాత వారి బ్రతుకులు ఏమయ్యాయో చూడండి.

సీ . దేవుడున్నాడను భావనచాలదు
కనుపింపడేమను జనులకొరకు
ఏచోటనున్నాడు యేరూపునున్నాడు
కనుగొనలేమను జనులకొరకు
ఆకారమదియేమి యాతడు పురుషుడా
యనిశోధనముజేయు జనులకొరకు
అతనినిజూచి మే మర్చింతు మనునట్టి
శ్రద్ధగల్గిన సర్వ జనులకొరకు

తే . గీ . విగ్రహమ్ము ప్రతిష్ఠించి వేడ్కనొందె
విశ్వసించిన వారికి వేడుకయ్యె

విశ్వరూపుని గనలేని పేదవారి
యాశదీరెను గుడిలోన నతనిజూడ ! 11

దేవుడుంటే కనిపించడేం అనే ప్రజలకోసం; ఎక్కడున్నాడు? ఎలా ఉంటాడు అనే జనులకోసం; ఆయన పురుషుడా? స్త్రీయా అని ప్రశ్నించే వారికోసం; అతడు కనిపిస్తే మేం పూజిస్తాం అని కోరుకొనే భక్తులకోసం విగ్రహాన్ని ప్రతిష్ఠించి చూపించారు. నమ్మినవారికి కోరిక తీరింది. యథార్థంగా దైవదర్శనం పొందలేమనుకున్నవారికి గుడిలో దేవుని రూపంచూశామని తృప్తికలిగింది.

మ. గుడిలో నర్చనజేయువారిగన నుక్రోషమ్ము ధర్మమ్మె? యి
యె్యడలన్ స్వేచ్ఛ గణింపలేరె? యిదియౌనే సోదరప్రేమ? యి
క్కడ దేవర్షులకన్న మీ రధికులే?కైవల్యమున్ గోరి యె
య్యెడలన్ ధ్యానమొనర్చినన్ దగును; నిందేముండె వైరుధ్యముల్ 12

ఎవరైనా గుడిలో పూజచేస్తున్నారంటే మీకెందుకయ్యా కోపం?వారి ఇష్టం వారిది. వారలా చేస్తుంటే సహించలేకపోవటం సోదరభావం అవుతుందా?పూర్వీకమైన ఋషులకన్నా మీరు గొప్పవారా? ముక్తికోరి ఎక్కడ ఏవిధంగా ధ్యానంచేసినా తప్పులేదని మీకు తెలియదా? ఇందులో విరోధమేముంది?

మ . మతధర్మమ్ములవన్ని యొక్కటియె; సామాన్యుల్ గ్రహింపంగ నే
మతమైనన్ కడు ధర్మసూక్ష్మమును సంభావించి పేర్కొంచు ని
శ్చిత లక్ష్యమ్మున నెత్తిచూపు నది చింతింపన్ మరోభావనా
స్మృతి కల్గించును; భేదభావముల తీరేయిట్లు రూపొందెడిన్ 13

నిజానికి అన్ని మతాల సారాంశమూ ఒక్కటే. సామాన్యులకు అర్థం కావటం కోసం ఏ మతమైనా కొన్ని సూక్ష్మధర్మాలను ప్రత్యేకించి పేర్కొంటుంది. ఇందువల్ల ప్రజల్లో వేరొకభావన కలుగుతుంది. ఇవన్నీ అభిప్రాయ భేదాలే కానీ అసలు భేదాలు కావు.

10. సత్యం

ఉ . సత్యము శాశ్వతమ్మయిన సద్గుణధర్మము; సర్వసృష్టియున్
సత్యముపైన నిల్చినది; సత్యమె యాల్గిన సూర్యచంద్రులున్
నిత్యత గోల్పడున్; ధరణి నిల్చిన భూతములన్ని నాశమౌ
సత్యమనంగ దైవమగు సర్వజనుల్ గమనించి సాగుడీ ! 1

సత్యమనేది శాశ్వతంగా ఉంటుంది. ఇది మంచి గుణాలు కలది. సృష్టి సమస్తమూ సత్యంపైన ఆధారపడి ఉంది. లోకంలో సత్యమే లోపిస్తే సూర్యచంద్రుల భ్రమణం చలించిపోతుంది. భూమిలోని భూతకోటి అంతా నాశనమైపోతుంది. సత్యం అంటే దైవమన్న అని తెలుసుకొని దాన్ని నిలుపుకోవాలి.

శా . సత్యాధారము లోకవృత్తము; మహాశాసౌధ సంరంభమున్
సత్యమ్మే; గమనింప రోదసిని నశ్రాంతమ్ముగా సౌర సాం
గత్యమ్మొంది భ్రమించు నీ గ్రహములున్ గంభీర సత్యోద్ధతిన్
నిత్యమ్మున్ చరియించుచుండు; మనకీ నీతుల్ ప్రవర్తింపవా? 2

ఈ లోకం సత్యంమీదనే ఆధారపడి ఉంది. మన ఆశలన్నీ సత్యంమీదనే ప్రవర్తిస్తున్నాయి. ఆకాశంలోని గ్రహాలన్నీ సత్యాధారమై నడుస్తున్నాయి. అలాంటప్పుడు మనకు సత్యంతో నిమిత్తం లేదా?

ఉ . లోకములేలువారికి ప్రలోభములేవియులేవు; సత్యమే
లౌకికపాలనమ్మున విలాసము వారికి; నే విధానముల్
ప్రాకటమయ్యె వారలకు వాటిని తప్పక నాచరించుటే
తేకువ వారిధర్మమగు; తీరు రవంతయు మారదెన్నడున్ 3

లోకాలను పాలించేవారికి ఎటువంటి ప్రలోభాలూ లేవు. లోకపాలనలో సత్యమే వారికి ఆధారం. వారి ధర్మాన్ని ఎలా ఆచరించాలో అలాగే వారు పాటిస్తారు. ఏనాటికీ వారి ప్రవర్తన మారదు.

మ . మనతోనే మనలోకముండినదె?సత్యంబంత లేకున్న మి
న్నును మన్నున్ చెరలాడిపోవె ! మనమే నోరార సత్యమ్ము ప
ల్కను సందేహముతో కృశించెదము; లోకంబిట్లు ఘూర్ణిల్లినన్
కనురెప్పల్ పడుకాలమందున జగద్దగ్ధంబు గాకుండునే! 4

లోకమంతా మనప్రమేయంతోనే నడుస్తోందా? సత్యమనేది లేకపోతే మిన్నూ మన్నూ ఏకమైపోవా? మనమే సత్యం పలకటానికి జడుస్తున్నాము. లోకం ఇలాగే ఉంటే

క్షణంలో బూడిద అయిపోతుంది.

ఉ. సత్యమునాచరించుటకు సాకులుజెప్పుచు దాటివేయు నీ
ప్రత్యయశీలురున్ ప్రగతిబాట చరించెడి ధర్మకోవిదుల్
ముత్యములౌ నసత్యముల మూటలునొంచుచు లోకమెల్ల సా
హిత్యముగూర్చి చెప్పెదరు హేయమెరుంగరు! వీరు మానవుల్ 5

ఈరోజుల్లో ప్రతివారూ సత్యం పలకటానికి సాకులుచెబుతూ దాటివేస్తున్నారు. కానీ అసత్యపుమాటలు మూటలుగా వొంపుతూ అది సాహిత్యం అంటూ అసహ్యప్రవర్తన చూపిస్తున్నారు.

ఉ. జీవనవార్ధిలో బ్రతుకు ఛిద్రముగానటుగాచి పావనం
బై విలసిల్లు తీరమును భద్రతజేర్చెడి నావ సత్యమౌ!
గావున దీని గాచుకొని కర్మమునొంచుడు! నిన్నుగాచు నీ
దేవత! యెల్లవేళల విధేయత సాగుము దీని వెంబడిన్ 6

జీవనయానంలో బ్రతుకు బండబారకుండా మంచి తీరాన్ని చేర్చే నావ సత్యం. కాబట్టి దీన్ని దృష్టిలో పెట్టుకొని నీకర్మఫలాన్ని సంపిదించుకో! నిన్నుకాపాడే దేవత సత్యమే. గుర్తుపెట్టుకొని నడుచుకో !

ఉ. సత్యమునాశ్రయించుకొని సాగినవారు మహర్షులౌ నిదే
నిత్యము జీవగట్టయని నిండుగసాగెడివారు దివ్య సాం
గత్యమునొందు; నింక కనుగానినివార లసత్యవాదులై
మృత్యుపథమ్ములో యముని మించుకృపాణముధాటి నానెడిన్ 7

సత్యాన్ని నమ్ముకొని జీవించేవారు ఋషులవుతారు.ఈ నమ్మకంతో జీవించేవారు దేవలోకాన్ని పొందుతారు. ఎంతకాలమైనా సత్యాన్ని గమనించలేనివారు యముని ఖడ్గానికి బలియవుతారు.

మ. బ్రతుకేరీతిని వెళ్లబుచ్చినను కొంపల్ మున్గిపోబోవు; నీ
గతి జీవాంతమునందు తోచెడిని! యింకన్ గాంచలేకున్నచో
జతగూడున్ యమపాశబంధనములే! సత్యానుశీలమ్మునన్
హతమౌ నాయమపాశముల్ పృథివి నీకాధారమేమౌనొకో!! 8

ఎలా జీవించినా ఎవరి కొంపలూ మునిగిపోవు; కానీ నీ ప్రవర్తనా ఫలితాలు నీకు నీ జీవితాంతంలో కనిపిస్తాయి. అప్పటివరకూ తెలుసుకోలేకపోతే యమపాశాలు బంధిస్తాయి. సత్యపాలనం వలన ఆ యమపాశాలు దూరమవుతాయి. లోకంలో నీకు

ఆదారమయ్యేది ఏదో తెలుసుకో !!

మ . మరణాంతమ్మునుగూర్చి యిట్టి భయమేమంతన్ గనన్ రాదు; యం
దరిత్రోవన్ జనుచుంటి నేను; కసిగా తర్కింపగానేల? నా
వరకే పాపభయమ్ములే దనుచు సంభాషించు పుణ్యాత్మునిన్
తరియంజాలను సత్యమార్గమున భేదంబింత లేకుండెడిన్ 9

“మీరు చెప్పేభయాలు నాకేవీ లేవు. నాకు మరణభయం అసలే లేదు. అందరూ ఏత్రోవలో వెడుతున్నారో నేనూ అదే త్రోవన వెడుతున్నాను. కనుక నన్నుగురించి అంత కసి ఉన్నట్లుగా చెప్పనక్కరలేదు. నాకు ఏ పాప భయమూలేదు.” అనేవారి గురించి కవిగా నేనేమీ చెప్పలేను.

ఉ . ఎప్పటికైన సత్యమొకటే ధర నిల్చు; నసత్యమంతయున్
ముప్పు గడించి పారును; ప్రమోద ప్రమాదములెల్ల నా డగున్
తప్పదు కర్మపాకఫల తర్పణమంతయు; మేలుకొన్నచో
నిప్పటికైన సత్యమును నిండుగ దాల్చుము నెమ్మనమ్మునన్ 10

ఎప్పటికైనా నిలబడేది సత్యమే. అసత్యము కనుమరుగవుతుంది. సంతోషమో, దు:ఖమో ఆనాడు తెలుస్తుంది. ఎప్పటికైనా కర్మ ఫలం తప్పదు. మేలుకొని ఇప్పటికైనా సత్యపాలనం చేయటం మంచిది.

సీ . సత్యలోకముదారి సన్మార్గమగుచుండె
నాదారి నడువగా నరయుమిపుడు
నిత్యకల్యాణమ్ము నిరుపమానమ్మగును
నాదారిబత్తెమ్ము నరయుమిపుడు
అత్యంతసుఖమయ మమరలోకమ్మురా
యందుండగా పుణ్యమరయు మిపుడు
భృత్యులు సేవింప పెంపారులోకమ్ము
నందుండు భాగ్యమ్ము నరయుమిపుడు

తే . గీ . సత్య సమ్మానమార్గమ్ము సరణినేగ
దివ్యభోగాలు సమకూరు దీనినెరిగి
భవిత నిర్మించుకొనుము నీ భాగ్యమేమొ
నీవె నిర్ణేతవగుదువు నీతి గనిన ! 11

సత్యలోకమార్గము మంచిమార్గం. ఆదారిలో వెళ్లటానికే ప్రయత్నించాలి. సత్యం నిత్యకల్యాణ యుక్త్తమైనది. జీవితాన్ని నడిపించటానికి అదే తగినది. సత్యం స్వర్గానికి సరియైనదారి. స్వర్గం అత్యంత సుఖమయమైనది. అందుండటానికి యత్నించాలి. దివ్యభోగాలు అక్కడ లభిస్తాయి.

ఉ . కష్టమెయైన సత్యమును గౌరవమొప్పగ దాల్చుమయ్య! నా
యిష్టమటంచు నే చెడు వరింపకుమయ్య! ధరాతలాన నా
శ్లిష్ట మనోజ్ఞజీవితవిశేషము ద్రుంపకుమయ్య!శిష్ట సం
క్లిష్ట పథమ్ము సత్యమగు; లేశము వీడకుమయ్య మానవా! 12

సత్యపాలన చాలా కష్టమే అయినా దాన్ని గౌరవంతో తలదాల్చవయ్యా! నా యిష్టంవచ్చినట్లు నేను నడుచుకుంటానంటూ చెడుదారిని వెళ్లకు. లోకంలో అనుభవించాల్సిన గొప్పజీవితాన్ని పోగొట్టు కోవద్దు. సత్యపథం కష్టమైనదైనా విడచిపెట్టకయ్యా !

ఉ . దేవుడు సత్యరూపుడు; సుధీమయమాతని దివ్యతత్త్వ మీ
జీవితమందు నాతని విశేషపథమ్మున పోవకున్న నీ
జీవనమేల? సత్పథవిశేషములేని మనుష్యుడన్న సం
భావనమేల? జీవన విభావసుడుండగ మేలుకొమ్మురా! 13

దేవుడు సత్యస్వరూపుడు. ఆతని తత్త్వం అమృతమయం. ఆయనదారిలో వెడితే మేలు కలుగు తుంది. మనుష్యులు ఆ మార్గంలోనే నడవాలి. జీవన ప్రభాకరుడుండగానే మనిషి మేల్కొనాలి.

11. వ్యక్తిత్వం

మ. మనకాదర్శము రామచంద్రుడతనిన్ మన్నించి యాదర్శ పా
త్రునిగా భావనజేసి వాని పథమందోలిన్ ప్రవర్తించినన్
ఘనశీలమ్మును పొందగాగలము సంఘమ్మందు కీర్త్యాదులున్
పొనరంగాగల వాతనిన్ దలచి సంపూర్ణమ్ముగా మ్రొక్కుడీ ! 1

మనకు శ్రీరామచంద్రుడు ఆదర్శపాత్రుడు. ఆయనను తలచుకొని ఆతని మార్గంలో మనం ప్రవర్తించినట్లైతే గొప్ప శీలసంపదను పొందగలం. అందువల్ల మనకు కీర్తి వంటివన్నీ లభిస్తాయి. కనుక ఆ రామచంద్రునికి భక్తితో నమస్కరించండి.

మ . పితృవాక్యమ్మునుబూని కానలకు తృప్తిన్ బోయె రాజ్యమ్ము నా
తత మర్యాదనొసంగె తమ్మునకు నతండష్టకస్టాలనొం
ది తలంపండట వీనిమూలమును నెందేనుండునే యిట్టి యో
గ్యతలున్ గల్గిన మానవుండు కడుమాయాలోకమందెచ్చటన్! 2

శ్రీరాముడు తండ్రిమాటప్రకారం తృప్తిగా అడవులకు వెళ్లాడు. తగిన మర్యాదతో రాజ్యాన్ని తమ్మునికి ఇచ్చేశాడు. తాను అష్టకష్టాలుపడికూడా మనస్సులో ఏమీ అనుకోలేదు. మాయదారి ప్రపంచంలో ఇలాంటి మానవుడు ఎవరైనా ఉన్నారా?

శా . ఏనాడైన పొగడ్తలన్ వలచెనా? హెచ్చున్ ప్రదర్శించెనా?
తానేమిన్నయటంచు గర్వపడెనా?దంభమ్ములన్ పల్కెనా?
పోనీ మాటను దాటిపోదమనెనా? పోనాడయోజించెనా?
నేనీ కష్టములన్ భరింపననెనా? నిందాకృతుల్ జేసెనా? 3

శ్రీరాముడు ఏనాడైనా పొగడ్తలు కావాలనుకున్నాడా? గర్వంచూపించాడా?నేనేగొప్ప అనుకున్నాడా?లేనిపోని ప్రజ్ఞలు పలికాడా?పోనీ ఆడినమాటను దాటివేద్దామనుకున్నాడా?నేనీ కష్టాలు పడలేనని, వాటికి కారకులైనవారిని ఎన్నడైనా తూలనాడాడా?లేదుకదా!!

ఉ . ఆడినమాటకై నిలచినట్టి మహాత్ముడు రామచంద్రుడే
పాడినెరింగినట్టి ఋజువర్తనుడా రఘురామమూర్తియే
పోడిమితోడ కాలగతి పొల్పు నెరింగినవాడు రాముడే
వాడిబలమ్ము నోర్మిగలవాడు రఘూద్వహుడొక్కడే కదా! 4

ఆడినమాట తప్పకుండా అందుకోసం నిలచినవాడు శ్రీరాముడే కదా! న్యాయం,

ధర్మం తెలిసినవాడు రఘురాముడేకదా! కాలప్రభావాన్ని తెలిసినవాడు బలశాలి కూడా శ్రీరాముడేకదా!

శా . అన్నల్దమ్ములు రామలక్ష్మణులు లోకారాధ్యులౌ వీరి క
న్నన్నెవ్వారలు మిన్న! యీ జగతిలోనన్ సీతయే స్త్రీలకున్
పున్నెమ్మున్ గరపించు దేవత! గుణోద్భూతమ్ములౌ రీతులన్
వన్నెల్ దీరగ నామెనుండి గ్రహియింపన్‌బోలు నెవ్వారికిన్ 5

ఉ . భారతమందు భీష్మకథ పల్కురకున్ గమనింపబోలు నా
వీరుడు తండ్రికై విసరు భీష్మప్రతిజ్ఞ యసాధ్యమేరికిన్
కూరిమి నీట తామరలు కూడిననీటిని తాకనట్లుగా
పారముజూచె నాతడు సుపర్వులు మెచ్చగ; వానినెంచుమా! 6

మహా భారతంలో భీష్మునికథ అందరకూ తెలిసిందే. ఆతడు తండ్రికోసం చేసిన ప్రతిజ్ఞ ఇంకెవరికీ సాధ్యం కాదు. నీటిలో తామర మాదిరిగా జీవితంలో ఏ జాడ్యాన్నీ అంటించుకోకుండా ఒడ్డుకు చేరాడు. ఆతని వైనాన్ని దేవతలుకూడా మెచ్చుకున్నారు.

ఉ . కౌరవ వర్గమందొకడుగా కొనసాగినగాని ధర్మ వి
స్తారకుడై యదూద్వహుని తత్త్వమెరింగి ప్రపన్నుడయ్యె; నా
శౌరి మహాట్టహాసమున చక్రముదాల్చి వధింపబూన నీ
వీరుడు వీరధర్మమును వీడక యోగివరేణ్యుడయ్యెడిన్ 7

భీష్ముడు కౌరవవర్గంలో ఒకడుగా కొనసాగినా గానీ ధర్మంవైపే ఉన్నాడు. శ్రీకృష్ణుని తత్త్వం తెలిసినవాడు కనుక ఆయనపట్ల శరణాగతిని ప్రకటించుకొన్నాడు. శ్రీకృష్ణుడు చక్రధారియై భీష్ముణ్ణి సంహరించటానికి మీదకురికినప్పుడు వీరధర్మంతో యోగియై నమస్కారంచేశాడు.

శా . ఎన్నేండ్లీ భువిపై మెలంగినను కాసింతైన దోషమ్ము దా
క న్నేరండన నెవ్వడీ బ్రతుకు సాగన్ జేయునో వానినే
మన్నింపన్ దగు మార్గదర్శకునిగా మర్యాదతో వాని రీ
తి న్నెన్నందగు నిట్టి యోచనయె ప్రీతిన్ దారి చూపెట్టెడిన్ 8

భీష్ముడు ఎన్నేండ్లు ఈభూమిమీద జీవించినా ,కించిత్తైనా దోషాలను మూటగట్టుకొనలేదు. ఆ విధంగా ఎవడు జీవయాత్రను సాగిస్తాడో వానినే మార్గదర్శకునిగా గ్రహించాలి. వారి మార్గాన్ని ఆదర్శంగా స్వీకరించాలి.

మ . చెడుదారిన్ బడబోకు; నీ నడత గాసింజెందగానీకు; మె
వ్వడు వ్రే లెత్తుచు నీదె దోషముల నావంతైన జూపించు స
వ్వడికిన్ మార్గము నీయబోకుము; దృఢత్వమ్ముంది విశ్వాసమే
ర్పడగా నీవు చరింపగా వలయు; నేర్వన్ బొమ్ము సన్మార్గముల్ 9

నీవు చెడుదారిలో నడవకు; దుర్మార్గంలో అలసట చెందకు; నీలో దోషాలున్నాయని ఎవడూ వ్రేలెత్తిచూపించే స్థితిని తెచ్చుకోకు. నిబ్బరంగా నడుచుకో! మంచాదారులను తెలుసుకో!

శా . నీలోపమ్ముల నీవు జూచుకొనుచున్ నిష్కర్షగా దిద్దుకో
జాలన్ మేలగు; వేరొకండు కెలకన్ సందర్భమీరాదు; యే
వ్రేలున్ నీగతి జూపకుండునటు నీవే ముందు జాగ్రత్తగా
మైలౌ దారి మలంచుకొమ్మిదియె గంభీరప్రదమ్మయ్యెడిన్ 10

నీలోని లోపాలను నీవే గుర్తించుకో! వేరొకడు కెలికే అవకాశం ఈయవద్దు. ఏ వ్రేలూ నీ వంక చూపకుండా జాగ్రత్తవహించు. మంచి దారిని ఎన్నుకో !

సీ . వ్యక్తిత్వమనునది వర్తిల్లువిధమౌను
ఎవరిపద్ధతి వారి దిలను జూడ
వ్యవహార సరణిలో వైవిధ్యముండును
వ్యక్తిగౌరవమూని యనుసరించు
సుప్రసిద్ధుల నడక చూరగొన్ననుచాలు
సుఖసంగతులు నీకు సొగసునిచ్చు
మంచిపద్ధతినెంచి మించిదాల్చినచాలు
మర్యాదలన్ని సన్మానమిడును
తే .గీ . ఇచ్ఛవచ్చినయట్లు చరించునెడల
నింటబయటను పల్లికిలించగలరు
కాక గౌరవమొందు కోరికయె యున్న
మంచి పద్ధతులను నీవు యెంచుకొనుము!! 11

వ్యక్తిత్వం అంటేప్రవర్తనా విధానం. ఎవరి ప్రవర్తన వారిదిగా ఉంటుంది. ప్రతివారి వైఖరి వేర్వేరుగా ఉంటుంది. దాన్నిబట్టే గౌరవం ఉంటుంది. సమాజంలో ప్రసిద్ధులైనవారి ప్రవర్తనను ఆదర్శంగా తీసుకోవాలి. అప్పుడు మన గౌరవం పెరుగుతుంది. ఇష్టంవచ్చినట్లు వ్యవహరిస్తే అల్లరిపాలైపోతాము.

చం . నినుగని గౌరవించగల నిండుదనమ్మును కోరుకొన్న నె
మ్మనమున తొట్రుపాటను ప్రమాదమువీడి ప్రశాంత వైఖరిన్
గని పలుకాడుతీరు నొక కమ్మని శస్త్రముగా ధరించుచున్
వినయ వివేకముల్ గలసి వేడుకజేయ చరించగావలెన్ 12

లోకం నిన్ను గౌరవించాలని కోరుకొంటే ముందుగా తొందరపాటును వదిలిపెట్టాలి. ప్రశాంతంగా మాట్లాడే వైఖరిని నేర్చుకోవాలి. వినయవివేకాలను అలవాటు చేసుకోవాలి.

చం . అనుపమ వాక్యవైఖరి సహాయగుణమ్మును శాంతబుద్ధియున్
చనువున నాత్మబంధువుల సంగతి నెల్లర పల్కరించుటల్
తనవలె తోటివారిని ప్రధానముగా కొనియాడు ధోరణుల్
ఘనమగు పద్ధతుల్ సహజగౌరవమిచ్చు యథార్థ భావనల్ 13

నేర్పుగల మాటతీరు, ఇతరులకు సహాయపడే లక్షణం, ప్రశాంతమైన ఆలోచన, అందరినీ ఆత్మబంధువులమాదిరిగా పలుకరించే చనువు, తోటివారినికూడా తనవలె మెచ్చుకొనే విధానం, అలవాటు చేసుకొంటే గౌరవం దానంతట అదే లభిస్తుంది.

12 . సాంఘికం

చం. మనుజులు సంఘజీవులు; సమర్థులు గారొకరొక్కరుండుగా
తనదు కుటుంబమున్ పొరుగు ధైర్యమునింపెడి తోడునీడయై
కనుగొను బంధువర్గము సుఖంబిడువారలు తోటి మానవుల్
జనుల సుగంధమై; నిదియు చాలక దైవము లోననిల్చెడిన్ 1

మనుషులు అందరూ కలిసిఉండే సంఘజీవులు. ఎవరికివారు విడివిడిగా ఏసంబంధమూ లేకుండా ఉండలేరు. ఇరుగూపొరుగూ, తోడూనీడా అనేవి మానవధర్మాలు. అందుకని ఒకరికొకరు బంధువులుగా కలిసి ఉంటారు. ఇంకా అందరినీ కలిపేందుకు పైన దేవుడున్నాడు.

చం . మనుజుల మానసమ్మది సమాంతర జీవన సాధమౌను; యిం
దున భగవానుడే చెలగి తోడ్కొనిపోయెడి వాంఛలెవ్వియో
కనుగొనరాక నిల్చి ఘనకార్యములెన్నియొ సంఘటించు వీ
నిన గమనించుకొంచు తన నిత్యవిధుల్ బొనరించు మానవుల్ 2

మనుష్యుల మనస్సు అనేది సమాజంతో సమాంతరజీవితం కలది. ఇందులో భగవానుడే స్వయంగా మనలోనికోరికలనుకొన్నిటినిహరించివేస్తాడు. అనంతరం ఆతడుమనలో ఉండి ఎన్నో ఘనకార్యాలను సాధిస్తాడు. అదేసమయంలో తనపనిని తాను చేసుకొంటాడు.

ఉ . అల్ప సమూహజీవనము యాదిమతత్త్వము; నేరగాండ్రనే
నిల్పును నాయకావళిగ నెవ్వగబూనుచు దిక్కులేక నే
కల్పయుగాంత కాలమున ఖైదున నుంచినరీతి యొంటియై
స్వల్ప మనోభిలాషలయి వర్తిలుచుండు జనుల్ విరాగులై! 3

చిన్నచిన్న సమూహాలుగా జీవించటం ఆదిమానవుల లక్షణం. నేరస్థులని తెలిసికూడా విచారపడుతూ వారినే నాయకులుగా నిలుపుకొంటున్నారు. యుగాంత సమయం వరకు ఖైదులో ఉండివచ్చినవారివలె ఒంటరిగా వైరాగ్యంతో ఏ ఆశలూలేకుండా కొందరు జీవిస్తున్నారు.

చం . పలువురు సంఘజీవనము పన్నుగసల్పుట మేలు; కాని వీ
రలు పొరుగున్ సహించుచు వరమ్ముగ భావనసేయజాలుచో
నిల సుఖశాంతులింపొసగ నెల్లరు సంతసమొంది భాగ్యవం
తులుగ విరాజిలున్ సగము తోషణమే బలమిచ్చు నీ యిలన్ 4

అనేకమంది కలిసి సహజీవనం చేయటం మంచిది. కానీ వీరు పొరుగువారిని చూచి సహించే లా ఉంటే అందరూ సుఖశాంతులతో ఉండగలరు. ఎవరికైనా సంతోషమే సగం బలం కదా!

మ . పదిరూపమ్ములజూడ వారి మదిలో భాగ్యమ్ముగా దేవుడే
పదియాకారములన్ ధరించి వెలుగై భాస్విఉ నీ భావనన్
మదిలో నిల్పి సహించుమందరిని, సమ్మానమ్ము నాడౌను ! దు
ర్మదమొందన్ సరికాదు; దేవుడెవరిన్ మన్నింపడిట్టైనచో! 5

పదిమందిలో దేవుడు పది యాకారాలు ధరించి ప్రకాశిస్తున్నాడని నీవు భావించాలి. అలాంటి భావనను మనస్సులో పెట్టుకొని, పొరుగువారిని సహించగలిగితే అదే నీకు సన్మామని భావించాలి. అంతేకానీ మదించి వ్యవహరించకూడదు. వారిని దేవుడు సహించడు.

ఉ . జీవులనందరిన్ భువిని సృష్టియొనర్చిన దేవదేవుడే
దీవెనలిచ్చి యందరిని దివ్యముగా భువిలోన నిల్పి సం
భావనజేసె సంతసము వర్థిలునట్లు ప్రజాళి యేకమై
జీవితముల్ రహింప నివసింతురటంచు మనోభిలాషలన్ 6

దేవుడు ప్రజలందరినీ భూమిపై నిలుపునాడే దీవించి అందరూ ఐకమత్యంతో మెలగాలని, స్నేహభావంవల్ల వృద్ధిపొందుతారని చెప్పాడు. ఆయన కోరికకూడా ప్రజల సంక్షేమమే.

చం . కులమత ప్రాంతభేదముల ఘూర్ణిలుచున్ ధర మానవత్వమే
కలుషితమౌ విధాన సవగాహనలేక చరించువారి రీ
తులు విషపూరితమ్మయి యధోగతి నొంచుచు మానవాళి శో
భల నశియింపజేయుచు నవారితమై చెరేగుచుండెడిన్ 7

ప్రజలు కుల,మత,ప్రాంత భేదాలతో కునారిలిపోతూ, మానవత్వాన్ని మరిచిపోతూ అపార్థాలతో సంచరిస్తే వారిఆలోచనలు విషపూరితాలవుతాయి. వారివల్ల మానవజాతి అథోగతి పాలవుతుంది.

ఉ . మానవులందరున్ గలసి మాన్యతమీరగ నైకమత్యమున్
పూని యొకేకుటుంబముగ పొల్పువహించిన మానవాళికం
పైన ఫలమ్ము లభ్యమగు; భద్రతకూడును యెల్లవేళ; లో
కాన లభించు సంపదనికాయము పంచుకొనంగ వీలగున్ 8

ఉ . మానవజాతియొక్కటియె; మంచితనమ్మును మానవాళిదే;
మానుగ శోధనాఫలము మానవులందరు పొందగావలెన్
దేనికిగాని యుద్ధముల దీక్షవహించుటమాని, దగ్గరై
పూనికతోడ శాంతిగని పొందు వహించిన మేల్లుటిల్లెడిన్ 9

మానవజాతి అంతా ఒక్కటే. అందరూ మంచితనంతో ఉండాలి. ప్రకృతి పరిశోధనాఫలాలను అందరూ అనుభవించాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ యుద్ధాలకు సిద్ధం కాకూడదు. శాంతియుతంగా వ్యవహరిస్తే అందరికీ లాభం కలుగుతుంది.

ఉ . గొప్పకుపోయి యుద్ధముల కొట్టుకుచచ్చిన మేలు కల్గునే?
తప్పులుదిద్దుకొంచు నొకదారి చరించుచు నెయ్యమూనుచో
నొప్పిదమౌనటంచు మదినొక్కొకదేశ మెరింగినన్ జగ
మ్మొప్పదె! లోకశాంతి యనుమోదముకాదె జగద్ధితంబుగన్ 10

గొప్పలకుపోయి యుద్ధాలతో కొట్టుకుచస్తే మేలవుతుందా? తప్పులు దిద్దుకుంటూ అందరూ కలిమిడిగా ఒక దారినిపోతే మంచిదికదా! అన్నిదేశాలవారూ స్నేహభావంతో నడుచుకుంటే మంచిదికదా! అందువల్ల విశ్వశాంతి లభిస్తుంది కదా!

సీ . మతయుద్ధములకోరి మతెక్కిపోరాడ
మానవత్వంబెచట మనును జగతి?
రంగుభేదములంచు రాజసూయము సేయ
రాజిల్లునే మన రక్షణమ్ము?
సంపద గరిమతో సయ్యాటలాడిన
సగటు ప్రపంచమ్ము సమతగనునె?
శాస్త్రసాంకేతిక సంగతిన్ మించిన
సడిలేని దేవాల నడకయేమి?

తే . గీ . మనుజులందరు నొకజాతి యనెడి భావ
మమరియుండిన మేలగు నదియె సంఘ
జీవనమ్మగు; కానిచో జీవమణగి
యాగవికమౌను; విశ్వమే యలజడియగు ! 11

మతయుద్ధాలతో కొట్టుకుఛస్తే మానవత్వం ఉంటుందా?ఒంటిరంగు భేదాలు చూసుకొని తన్ను కుంటే మనకురక్షణఉంటుందా?సంపదఉందనివిఱ్ఱవీగితే ప్రపంచంలో సమానత్వం కలుగు తుందా?కొన్నిదేశాలు శాస్త్రసాంకేతిక రంగాల్లో

పురోగమిస్తే మిగతా దేశాల పరిస్థితి ఏమిటి?

చం . కలిగిన కాలమంతయు సుఖమ్మున నుండిన మేలుగాదె? బం
ధులుగ ప్రపంచపౌరులు యథోచితరీతిని సాగుచుండినన్
కలిమి రహింపదే! సుఖవికాసములవ్వి సమస్తమానవుల్
చెలిమిని పంచుకోరె! పలు చింతలులేక సుఖింపరే యిలన్! 12

కలకాలం సుఖంగా ఉంటే చాలదా? ప్రపంచపౌరులందరూ బంధువులుగా కలిసినడిస్తే మంచిదికాదా? ప్రపంచంలోని సుఖసంపదలన్నీ స్నేహంతో అందరూ పంచుకోవచ్చుకదా! ఎలాంటి దిగుళ్లులేకుండా అందరూ సుఖంగా జీవించవచ్చుకదా!

ఉ . సాంఘికజీవనమ్ము కడు శాంతముగా కొనసాగ మంచిదౌ
సంఘబలమ్ము జీవులకు శాశ్వతమౌ బలమిచ్చిగాచు; నీ
సంఘములిన్ని భేదముల సాగుటకాదు; యొకే విధానమౌ
సంఘము మానవాళి కిల సన్నుతమౌ కొనసాగుడవ్విధిన్ 13

సాంఘికజీవితం ఎంత ప్రశాంతంగా సాగితే అంత మంచిది. సంఘబలం ప్రజలకు శాశ్వతబలమిస్తుంది. లోకంలో ఇన్ని సంగాలు ఉండటంకాదు. సర్వ మానవ సంఘం ఒకటిగానే ఉండాలి. మానవజాతి అంతా ఒకే సంఘం అని భావిస్తే లోకకల్యాణమవుతుంది.

13. కులం

చం. కులము సమూహమౌ; మనుజకూటమియంత యొకేకులమ్ము; కా
కులు చిలుకల్ చకోర బక కోకిలలన్నియు పక్షిజాతియే
కులములువేరుగావు; జనఘోష కులమ్ములబంచి వేర్పడన్
తలకొకరీతిగా కులము దారినొనర్చెను భిన్నమౌనటుల్ 1

కులం అనేది ఒక జనసమూహం. మనుజ కూటమి అంతా ఒకే కులం. ఎందుకంటే కాకులు, చిలుకలు, చకోరాలు, కోకిలలు అంటూ వేర్వేరు పక్షిగణాలు ఉన్నా అన్నీ ఒకేవిధమైన జాతి అలాగే మనుషులందరూ ఒకటే జాతి. కానీ కులాలపేరుతో తలకొకకులంగా మనుషులు వేరైపోయారు.

ఉ . ఇందరు మానవుల్ బహువరిష్ఠగణమ్ముగ చీలిపోయి మే
మందరమొక్కటంచు కులమాన్యత పేర్కొని వేరువార లిం
కొందరు వేరుపేరగల కూటమిగా పలు భిన్నవర్గులన్
చిందరవందరై ప్రజలచీల్చి కులమ్ములపేర పంచెడిన్ ! 2

మానవులు జనసమూహంనుంచి చీలిపోయి విడిగా ఏర్పడి తామందరూ ఒక కులమని పేర్కొంటారు. అలాగే ఇంకొందరు మరొకకులం వారమంటారు. ఇలా భిన్నకులాలు ఏర్పడతాయి.

చం . మునుపటికాలమందు ననుమోదముతో నొకవృత్తినుండి దా
నిని కులవృత్తిగా మలచి నేర్పువమించి యదే క్రమమ్మునన్
తనకులమన్నపేర నొక ధర్మము విస్తరిలెన్; కులమ్ములున్
వెనుకడుగైనగాని తమభేదము మాత్రము సాగుచుండెడిన్ 3

పూర్వకాలంలో రకరకాలవృత్తులుండేవి. ఆయావృత్తులను చేసేవారిని ఆయా కులాలుగా పిలిచేవారు. క్రమంగా ఈవ్యవహారం స్థిరపడి వృత్తిధర్మాలు పోయినా కులాలు మిగిలాయి. ఇంకా కులభేదాలు మరింతగా పాతుకుపోయాయి.

మ . కులవృత్తుల్ నశియించిపోయిన కులాక్రోశమ్ములున్ పోక మా
కులమే గొప్పదటంచు పోరుచు జనుల్ కూటాలయుద్ధమ్ముతో
పలువైషమ్యములూని వేరుపడుచున్ భాగ్యమ్ము పోద్రోచి ము
క్కలుగాచీలి సమాజమందు వెడగై కల్లోలతన్ నించెడిన్ 4

కాలక్రమేణా కులవృత్తులు నశించిపోయాయి.కానీ కులవైషమ్యాలు మాత్రం పోకుండా నిలిచాయి. పరస్పర విద్వేషాలతో ప్రజలు వేరై యుద్ధాలతో

కుమ్ములాడుకొంటూ దరిద్రులై ఐక్యతకుబదులు ముక్కచెక్కలు గా చీలుతున్నారు.

ఉ . మా కులపోళ్లమందరము మంచిని చెడ్డను నందరొక్కటై
ప్రాకెదమంతె గాని పెరవారల సైపమటంచు పల్కుటల్
చీ కొనగూర్చు నెల్లరు విశిష్టత నైక్యతగూడియున్నచో
తేకువతోడ మేలగు విధేయత గల్గును దేశమంతటన్ 5

మంచియైనా, చెడ్డయైనా మా కులంవాళ్లమందరం ఒకటిగా నడుస్తాం. అంతేగానీ ఇతరులను సహించం అనటం బాధకలిగిస్తుంది. అలా కాకుండా మంచి ఆలోచనతో అందరూ కలిసినడిస్తే అందరికీ మేలు కలుగుతుంది. దేశం బాగుంటుంది.

మ . కులతత్త్వమ్మున కొందరింపరయగా ఘూర్ణిల్లుదేశమ్ము; మే
లొలయన్ కొందరికే సుఖంబమర నాలోచింప సేమమ్ము గా
దిలపై నందరు మేలునొందవలె నంతేగాని యే కొందరో
కులనామమ్మున కూడబెట్టుకొను నుక్రోషమ్ము పెంపొందెడిన్ 6

కులతత్త్వం కొందరికి ఇష్టమైనదైనా దానివల్ల దేశం పాడవుతుంది. అది కొందరికే లాభకరం. ఆవిధంగా ఉండరాదు. అందరికీ లాభం కలగాలి. లేకపోతే దేశంలో అసమానతలు పెరుగుతాయి.

చం . కులమొకగుర్తు వృత్తికి; ప్రకోపమునన్ కులతత్త్వమూని సం
కుల సమరమ్మొనర్చిన నిగూఢముగా మిగతాకులమ్ములున్
విలయమొనర్పబూనును; నభీప్సిత మెవ్వరికౌను? యందరున్
కలహపరంపరన్ దగిలి కయ్యమొనర్ప లభించు నాశమే ! 7

చేసేవృత్తికి కులం ఒక సంకేతం. అంతమాత్రందానికి ఆవేశపడి కులత్త్వం పెంచుకుంటే ఆ భావన అన్నికులాలలోను వస్తే విలయం సంభవిస్తుంది. ఎవరి ఆశలూ నెరవేరవు. చివరికి ఒకరితో మరొకరు కలహించుకోవటం తప్ప, నాశనం తప్ప కలిగే లాభం ఏమీ ఉండదు.

ఉ . లాభములెన్నియైన వరలన్ గ్రహియింపగవచ్చు;కాని మ
త్తేభములట్లు తన్నుకొను దీక్షకు నెవ్వరు మెచ్చబోవ రే
వైభవమైన నందరకు వర్తిలగావలె గాని కొందరే
శోభనశీలురన్న నుడి సుంతయు చెల్లదు కూటనీతిగా ! 8

ఎన్నిరకాల లాభాలైనామంచివే. కానీ తన్నులాటలకు ఎవరు సిద్ధమవుతారు? వైభవం అంటే అందరికీ కావాలి. అది కొందరికే అంటే ఎవరు అంగీకరిస్తారు? అది నీతిమాలినపని అవుతుంది.

చం . ఘనగుణశీలవంతులకు గౌరవమొప్పు పదంబు లీవలెన్
తనకులమేదియైన, పరతంత్రము గా దిది; బుద్ధిశాలురన్
గని తగురీతిగా పదవి గౌరవమిచ్చినదేశమెల్ల శాం
తిని గని నెమ్మనమ్మున సుధీ విభవమ్మును గాంచుచుండెడిన్ 9

ఏ కులంవారికైనా గుణవంతులైతే వారికి గౌరవప్రదమైన పదవులనీయాలి. ఇది బానిసత్వం కాదు.బుద్ధిమంతులను కనిపెట్టి వారికి తగిన గౌరవమిస్తే దేశమంతా బాగుపడుతుంది.

శా . మేధావంతుని మేధకున్ తగిన సమ్మేళమ్ము గల్పించి యే
శోధమ్మున్ చెలరేగకుండునటు సత్సూత్రమ్ము పాటించుచున్
యాథార్థ్యమ్ముగ సాగిపోయిన మహోద్ధ్యాయమ్మగున్ గాని నీ
మేధాశక్తి గణింపలేమన జనంబేమౌను దేశమ్మునన్ 10

మేధావులకు తగిన స్థానం కల్పించి ఎవరికీ ఏ తక్కువతనమూ కలుగకుండా చూస్తే అది గొప్పతనం . అంతేగానీ మేధాశక్తిని మేం లెక్కచేయమంటే అది ప్రజలకు నష్టం .

సీ . ఆనాడు కులనిర్ణయంబెట్లు జరిగెనో
యీనాటి రూపమ్మదెట్టులుండె?
ఆనాటి కులధర్మమున లాభమేమియో
యీనాటి కులపోరులెట్లు గలవొ?
ఆనాటి సంఘమ్ము సాకారమదియేమొ
యీనాటి సంఘవిధానమేమొ!
ఆనాటి కులభావమది యెట్టులుండెనో
యీనాటికది మారి యెదిగెనెట్లు?

తే . గీ . మార్పుమంచికిచోటిచ్చి మరలవలెను
కాని మార్పులు పతనమ్ము కనగరాదు;
స్వార్థబుద్ధులు చెలరేగి సంఘనీతి
చెఱచబూనుట సరికాదు తఱుమవలయు!! 11

పూర్వం కులాలనిర్ణయం ఎలా జరిగిందో దానికి ఇప్పుడు ఎలాంటి స్థితివచ్చిందో చూస్తున్నాం. ఆనాడు కులాలవలన ఏం లాభం కలిగిందో ఇప్పుడు ఎలా తన్నుకుంటున్నామో చూస్తున్నాం. ఆనాటి సాంఘికపరిస్థితులేమిటో, ఇప్పటి స్థితి ఏమిటో చూస్తున్నాం. ఆనాడు కులం అంటే ఏమిటో ఇప్పుడేమిటో చూస్తున్నాం. మార్పు ఏదైనా మంచికిచోటిచ్చి తప్పుకోవాలి. కానీ మార్పులవల్ల పతనం కలుగకూడదు.స్వార్థపరులు చెలరేగిపోయి సాంఘికననీతిని నాశనం చేయకూడదు.

ఉ . వృత్తివిధానముల్ తొలగి వేరొకజీవనవృత్తమేర్పడన్
చిత్తములో కులమ్ములను చింతనజేయగనేల? యింకపై
మొత్తము జాతియంతయును పూర్తిగ నొక్కకులమ్ము పేరిటన్
సత్తువమాని సాగుట ప్రశాంతతగూర్చును ; సాగుడివ్విధిన్ 12

పూర్వం ఉన్న వృత్తివిధానాన్ని తొలగించి కేవలం కులాలను దృష్టిలో పెట్టుకునే ఆలోచన ఎందుకుచేయాలి? అలా అయితే జాతిమొత్తాన్ని ఒకే కులంగా నిర్ణయిస్తే ప్రశాంతత లభిస్తుంది.

ఉ . అన్యమతాలపుణ్యమున నందరు నేకముఖాన సాగుచున్
ధన్యులుగా చరించునెడ దారినితప్పు కులమ్ములేలరా?
శూన్యచరిత్రకన్న పరిశుద్ధ మనమ్మది మిన్నయౌ గదా
జన్యువులెల్ల కూడుకొనుజాతికి నింక కులమ్ములేలరా? 13

అన్యమతాల పుణ్యమా అని దేశప్రజలందరూ ఒకటే భావనతో కదులుతూంటే వీరిని దారి తప్పించే పనులెందుకురా? చరిత్రహీనతకంటే మంచి మనస్సు గొప్పదికదా! ప్రజల జన్యువులన్నీ కలిసినప్పుడు ఇంకా కులాలు ఎక్కడుంటాయిరా?

14. యువత

ఉ . దేశభవిష్యమీ యువతదేయగు; వారలు శ్రద్ధబూనినన్
దేశపురోభివృద్ధి పరితృప్తి వహించి రహించి మించు; వా
రే శివమెత్తి యల్లరి వరించిన దేశము నాశమౌను; జా
త్యాశయ సంపదల్ యువతయందున నున్నవి మేలుకోవలెన్ 1

దేశభవిష్యత్తు యువతమీదనే ఉంది. వారు శ్రద్ధగా పూనుకుంటే దేశం వృద్ధిచెందుతుంది. కాదని అల్లరిచిల్లరగా తిరిగితే దేశం నాశనమౌతుంది. జాతి ఆశలన్నీ యువతపైనే ఉన్నాయి.

ఉ . బుద్ధియు దేహశక్తియును పొల్పువహించును యౌవనమ్మునన్
యుద్ధముసేయజాలిన, ప్రయోజకులైనను నిష్క్రియాపర
త్వొద్ధతి బూనినన్ యువకవర్గముదే తగు బాధ్యతౌను; వీ
రిద్ధర నేలజాలిన గరిష్ఠులు జాతి పతాక లెయ్యెడన్ 2

యౌవనంలో బుద్ధితోపాటు దేహశక్తికూడా సమర్థవంతంగా ఉంటుంది. వారు యుద్ధానికి సిద్ధపడగలవారు. అటువంటివారు నిష్క్రియాపరత్వంలో ఉండటం సమర్థనీయం కాదు. వీరు ఈనేల నేలగల జాతీయవీరులు.

శా . చైతన్యమ్మునకింటిపేరు బలవిస్తార ప్రశస్తాదు లీ
జాతీయాకృతి మేని సంపదలు; వైశారద్యపారీణతా
ఖ్యాతిన్ బూనెడి లోహఘంటికలు; సంస్కారమ్ము తోడైన నే
రీతిన్ జాతినిగాచు యోధులగు; వీరేలేక మేలెట్లగున్! 3

చైతన్యం అనేది యువకులకు ఇంటిపేరు. వీరికి ఉన్న విస్తారమైన బలం జాతీయ సంపద అని చెప్పాలి. వీరి సామర్థ్యం , నైపుణ్యం అనేవి లోహఘంటికలవంటివి. వీరు సంస్కారవంతులైతే జాతిని కాపాడగలుగుతారు. వీరు లేనిదే దేవానికి మేలు కలుగదు.

చం . యువకులు దేశసైనికులు; నాయుస్థానముల్ జాతికిన్
ప్రవిమల బుద్ధిశాలురు ప్రభావ సమన్వితులెందు జూచినన్
జవముగలట్టియశ్వములు జాతికి వీరలు జీవగఱ్ఱలౌ
నవతకు జోతలిచ్చు పరిణామ విశారదు లెల్లవేళలన్ 4

దేశానికి సైనికులు యువకులే. ఆయువుపట్టు యువకులే. బుద్ధివాలురు యువకులే. ఎక్కడైనా ప్రభావాన్నిచూపగలవారు యువకులే. వీరు వేగంగల

గుబ్బాలవంటివారు. జాతికి జీవగఱ్ఱలు. క్రొత్తదనానికి, మార్పుకు ఆహ్వానం పలికేవారు యువకులే.

ఉ . సత్తువతోడ సంస్కృతిని చాటు పతాకలు వీరు; దీక్షతో
నెత్తరినైన కార్యములనెందును సాధ్యము సేయగల్గు వా
రొత్తిడినిన్ జయించి పటుయుద్ధమశక్తిని మీటి మేటియై
పెత్తనమున్ వహింపగల పెన్నిధి వీరలు జాతి నేతలున్ 5

యువకులు శక్తిగలవారు. దేశ సంస్కృతిని చాటగలవారు. దీక్షతో ఏపనినైనా చేయగలవారు. దేనినైనా సాధించగలవారు. ఒత్తిడిని తట్టుకొని నిలబడగలవారు. ఉద్యమించగలవారు. పెత్తనంచేయగలవారు. వీరే జాతినాయకులు కాగలరు.

మ . యువమేథావులు జాతికేతనములౌ యుక్త్యాత్మసంకేతముల్
భవితవ్యమ్మున పాలనాది విధులన్ భాగ్యోన్నతుల్ గూర్చు దీ
ప విరాడ్రూపులు చేతనత్వఘనులై భద్రమ్ముచేకూర్చు సై
న్య వరేణ్యుల్ యువశక్తి రక్షకులునై యాకాంక్షలన్ దీర్చెడిన్ 6

మేథావులైన యువకులు జాతీయపతాకలవంటివారు. దేశానికి తగిన చిహ్నాలవంటివారు. ముందురోజుల్లో దేశపాలనలో గొప్పవిధులు నిర్వర్తించి సౌభాగ్యాన్ని సమకూర్చగల దైవ స్వరూపులు. దేశరక్షణా నిపుణులు. ప్రజలకోరికలను తీర్చగల సైనికులు వీరే.

మ . చెడుమార్గమ్మునుబట్టి సంస్కృతిని విచ్ఛిన్నమ్ముగాజేసి వై
చెడివారిన్ నిలుపంగలేక యువకుల్ చెర్లాడుచున్ కూర్మి తో
డ్పడులీలన్ గమనింపగా భవిత యే బాటన్ ప్రయాణించు చుం
డెడినో యంచు విచిత్రమయ్యె నిది ఖండింపన్ వలెన్ పెద్దలున్ 7

మన సంస్కృతిని పాడుచేసేవారిని అడ్డుకోలేక వారికి యువకులుతోడ్పడుతూ ఉండటం చూస్తే భవిష్యత్తు ఏమవుతుందో అర్థమవుతోంది. పెద్దలు దీన్ని ఖండించాలి.

మ . మన సంస్కారము నిచ్చగింపక పరుల్ మన్నించు మార్గమ్ములం
దున బోవన్ దలపోయు భావనలు నెంతోహీనమౌ నన్న యో
చనయున్ దోచదు కుఱ్ఱకారునకు నీ చందంబు మేల్గాదు; దీ
నిని మాన్పన్ వలె నెల్లెడన్ మనదియే నేర్పన్ విచారింపుడీ ! 8

మనసంస్కారం పనికిరాదంటూ ఇతరుల దారిని నడవాలనుకునే ఆలోచనలు ఎంత హీన మైనవో కుబ్జకారుకు తెలియటంలేదు, ఇది పద్ధతి కాదు. దీన్ని మాన్పించి మన పద్ధతుల్ని నేర్పాలి.

ఉ . చక్కని సంప్రదాయమును సాగగనీయక హీన సంస్కృతిన్
మ్రొక్కి భుజానకెత్తుకొని మోయుచు హీనతనొందు కర్మ మీ
కెక్కడిదయ్య? మీ పథము హెచ్చుగుణమ్ముగలట్టిదైన వే
రెక్కడ దారిలే నటుల హీనతనొందగ సిగ్గులేదొకో! 9

గొప్పసంప్రదాయాన్ని సాగనీయకుండా, హీనసంస్కృతిని మోసే కర్మ మీ కెందు కయ్యా? మీ స్వంతమార్గం గొప్పదే అయినా దాన్ని వదిలేసి హీనసంస్కృతిని మోయటమెందుకయ్యా

శా . ఈవిశ్వమ్మునకెల్ల సంస్కృతి విభాగించెన్ మహాభారతీ
దైవాశీర్వచనమ్మనంగ నది విద్యారూపమో లేక యిం
కే వేదాద్భుతమో మమత్తరముగా కీర్తింగడించెన్ ధరి
త్రీ వైభోగము భారతీ ఫలమె పేర్మిన్ జెందె సత్కీర్తితో!! 10

ప్రపంచం అంతటికీ భారతదేశమే సంస్కృతిని నేర్పింది. అది దైవాశీర్వచనమో లేక మన విద్యాప్రభావమోగాని మొత్తంమీద భారతదేశానికి విశేషఖ్యాతి లభించింది. నేడీ భూమండలం ఇంత విఖ్యాతిని పొందటంలో భారతదేశం పాత్ర గణనీయం.

సీ . యువత ముందున్నచో నుత్తేజమమరును
నుత్సాహపరులదే యుద్ధజయము
యోజించగల నేర్పు యువకులకే యుండు
యువరక్త ముప్పొంగుచుండు నెపుడు
యురకలెత్తెడిచేవ యువకులసొమ్మగు
నుద్ధరించెడివారు యువజనాళి
యున్నతయోజనా యుక్తిశక్తులుగల్గి
యుద్రేకమునపొంగు యువకులెపుడు!

తే .గీ . జాతి సంస్కృతి నిలుపు విశాలతరము
యువతరమ్మగు నిలలోన నోర్పుయున్న
యువతయే కీర్తిగొని నిల్చి భవితనిచ్చు
నవసమాజంపు నిర్మాత యువకుడగును !! 11

ఉత్సాహవంతులైన యువకులు ముందు నిలిస్తే యుద్ధాలలో విజయం మనకే లభిస్తుంది. యువరక్తం ఉప్పొంగుతూ ఉంటుంది కనుక ఆలోచించగల నేర్పు యువకులకే ఉంటుంది. యురకలెత్తేచేవ యువకులకే ఉంటుంది కనుక సమాజాన్ని వారే ఉద్ధరించాలి. వారు ఉన్నత మైన ఆలోచన కలిగిఉండి ఉద్రేకంతో ఉరకలు వేస్తూంటారు. కనుక జాతి సంస్కృతిని వారే నిలబెట్టాలి.యువకులు ఓర్పుతో వ్యవహరిస్తే వారూ, దేశమూకూడా కీర్తివంతులవుతారు. నవ సమాజనిర్మాతలై దేశానికి భవితను తీర్చిదిద్దగలరు.

మ . మధుపానంబున మేను మన్నగును సంభావింపరాదన్న నీ
వ్యథ నెవ్వార లెరుంగలేరు; తుది నీవే మట్టియౌవేళ నీ
కథ నాత్మన్ తలపోసి దు:ఖపడి నిష్క్రాంతిన్ వ్యథాపూర్ణ దు
ష్పథమున్ వీడి మృతిన్ తరించెదవు దౌర్భాగ్యమ్ము నిన్ వీడగన్ 12

మధుపానం మంచిదికాదని చెబితే దానివల్ల కలిగే బాధ అర్థం కాదు. కానీ చివరికి మట్టిపాలయ్యేటప్పుడు ఆత్మకథను తలచుకొని దు:ఖపడి బాధతో చనిపోయేనాడు నీ దౌర్భాగ్యం నిన్నువిడిచినప్పుడు నీకు ఈవ్యసనఫలితం అర్థమవుతుంది.

సీ . మిట్టమధ్యాహ్నాన నిట్టనిల్వున నిల్చు
రవికిరణమ్ములీ యువత యనగ
మానసగంగోత్రి మదినుండి యురికిన
మహనీయచైతన్య మహిమ యనగ
ఆంజనేయస్వామి యస్ఖలితమ్మగు
నింద్రియశక్తి నార్జించుయువత
బ్రహ్మసృష్టి బలమ్ము పదునింపుగానొంది
రహియించు తేజో విరాజి యువత
తే . గీ . జవముగల్గిన సృష్టిబీజమ్ము యువత
తప్పుదారిన బడినచో ముప్పుకాదె?
యట్లు నిర్వీర్యమైన నిక్కట్లురావె?
కనుక నిగ్రహమొక్కటే కలిమి నించు!! 13

మిట్టమధ్యాహ్నవేళ నిట్టనిలువుగా ప్రసరించు సూర్యకిరణాలవంటి ప్రభావంకలవారు యువకులు. మానసగంగోత్రినుండి క్రిందికి ఉరికే

మహనీయమైన చైతన్యం కలవారు యువకులు. ఆంజనేయస్వామివలె అస్ఖలిత బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తూ ఇంద్రియశక్తిని సంపాదించు కొనేవారు యువకులు. బ్రహ్మసృష్టిలో పదునైన బలాన్ని నింపుకొని ప్రకాశించేవారు యువకులు. అటువంటి జవసత్వాలుగలవారు తప్పుదారినిపడితే ప్రమాదం కదా! వారు నిర్వీర్యులైతే జాతి నశించిపోతుంది కదా! కనుక యువకులు నిగ్రహాన్ని అలవాటు చేసుకోవాలి.

మ. ఒకలక్ష్యమ్మునులేక తోచినటులేదోరీతి వర్తించుచో
వికలమ్మైజను జాతి పౌరుషము కుంభీపాకమన్నట్లు; నీ
వొక జాతీయతకున్ ప్రతీకవని యెంతో నిగ్రహమ్మూని ని
ల్వకయున్నన్ భవితవ్యమేమగును ? సంభావింపుమా కూర్మితో ! 14

జీవితానికి ఒక లక్ష్యమంటూలేక తోచినరీతిగా వ్యవహరిస్తే జాతి పౌరుషం కుంటువడిపోతుంది. యువకులు ఒక జాతీయతకు ప్రతీకలని గుర్తించి నిగ్రహంతో ఉండక పోతే భవిష్యత్తు నాశనమవుతుంది. నిదానంతో యువకుల్లారా ఆలోచించండి!

ఉ . ప్రేమయటన్న మైకమున పిచ్చిదగుల్కొని యాడపిల్ల నె
మ్మోము గనంగనే యఖిలమున్ మరపొందుచు ముందువెన్క నే
మేమియు గాంచలేక బ్రతుకే యిక నామెదటంచు గ్రుడ్డిగా
కాముకదృష్టితో జన సుఖాంతమె నీ బ్రతుకీవిధమ్మునన్ ! 15

ప్రేమ అనే మైకంలోపడి పిచ్చివాళ్లై ఆడపిల్లముకం కనిపిస్తేచాలు అన్నీ మరచిపోయి ముందూ వెనుకా యేమీ గమనించలేక, ఇక బ్రతుకంతా ఆమెదే ననే కాముకత్వం కమ్ముకున్న గ్రుడ్డిబ్రతుకువలన సుఖం కలుగుతుందా?

ఉ . అల్లరిమూకతో జనుచు నాగడముల్ బొనరించుచుండి నీ
యిల్లును గుల్లజేసుకొను నెంగిలిపోకడ భిక్షపెట్టునా?
కల్లకబుర్లతో విలువగల్గిన కాలము చూరబుచ్చి నీ
వెల్లెడ నాశమౌగతిని యెన్నడునైన స్పృశించియుంటివా? 16

అల్లరిమూకతో కలిసి ఆగడాలు చేస్తూ యిల్లుగుల్లచేయటంవల్ల కూడు దొరుకుతుందా? కల్లబొల్లికలబుర్లతో విలువైన కాలాన్ని వ్యర్థంచేసుకుంటూ నాశనమౌతున్న సంగతిని ఎన్నడైనా గమనిస్తున్నారా?

ఉ . నమ్మినబంటులై యువత నాయకులన్ మనసారనమ్ముచున్
సొమ్ములుప్రోగుచేయుచు విశుద్ధిగ వారికి నందజేసి వా

రిమ్మగ నుద్ధరింతురని నెంతయు నమ్ముచు సేవజేయుచున్
గమ్మున కాలమున్ గడుపగల్గిన మూర్ఖుడవేమి నీ విటన్? 17

యువకులు నాయకులను నమ్ముతూ ప్రజలనుండి సొమ్ములు ప్రోగుచేస్తూ ఆ నాయకులకు అందిస్తూ, వారేదో ఉద్ధరిస్తారని విశ్వసిస్తూ, వారికిసేవచేస్తూ కాలంగడపటం గొప్ప మూర్ఖత్వం.

చం . చదువున దృష్టినిల్పరు; విశాలమనస్కత నొందబోరు; నె
మ్మది గనలేరు సత్యమును; మానుగ తోచునదేది దానినే
పదనుగ బుద్ధినెంచి ఋజువర్తనగాంచగలేక భ్రష్టులై
మదమున పొంగుచుందు రిది మంచిది కాదు కుమార గాంచుమా!18

నేటి యువకులు చదువపై దృష్టి నిలపరు.విశాలమనస్తత్వం అలవాటు చేసుకోరు. నెమ్మదిగా సత్యశోధన చేయలేరు.ఏదితోస్తే దాన్నే నమ్ముతారు. ఋజువర్తనలేదు. గర్వంచేత పొంగిపోతూ భ్రష్టులవుతున్నారు. ఇది మంచిది కాదు.

15. యువతీ

ఉ . సున్నితతత్త్వమింపొందవుచొప్పుగలట్టి సుమాస్త్రతుల్య వీ
వన్నది సత్యమౌను; కుసుమాయుధ సంపద నీ విభూషణ
మ్మెన్నగ నీ ధరాతలము తిన్నగ నీ పరివృత్తిచుట్టుచున్
కన్నెరికమ్మెరుంగనటు కాంక్షలతో పులకించుచుండెడిన్ 1

ఓయువతీ! నీవు సున్నితత్త్వంగల పూవువంటి సుకుమారివి. కుసుమాలే నీకు ఆయుధాలు ఆభరణాలు ప్రపంచం అంతానీచుట్టూ తిరుగుతూ నీపైన ఏవో కోరికలతో పులకరిస్తూ ఉంటుంది.

ఉ . సృష్టిని కాంతయున్ కనకపిద్ధియు నెల్లరి వాంఛితమ్ము; యే
దృష్టియు గాంచబోని యువతిన్ పరమాదురమేదురమ్ముగా
స్రష్టయె సృష్టిజేసెనిటు; సర్వమెరింగిన తల్లియొక్కతే
యుష్టతనిన్నుగాచుచు వరిష్టత గాంచెడు లోకమందునన్ 2

ప్రపంచంలో అందరూ కాంతాకనకాలను కోరుకుంటారు. ఎటువంటి అభిప్రాయాలను బుఱ్ఱలో ఉంచుకోని యువతులను ప్రేమతో విధాత సృష్టించాడు. తనకుమార్తె మనసులో ఏం ఉందో ఆమెను కన్న తల్లికే తెలుస్తుకొని కాపాడుతుంది.

శా . సంసారమ్మును చక్కదిద్దగల ధీ సంయుక్త నైపుణ్యముల్
హంసన్ బోలె గుణాగుణత్వ మరయంగా జెల్లు ధీరత్వమున్
హింసావృత్తినణంచు మాతృమమతా హేమాంశు రేఖావళుల్
శంసాపూర్వక శీర్షముల్ యువతి ! నీ శైలీవిహారమ్మునన్ 3

సంసారాన్ని చక్కదిద్దగల ధీమంతురాలు యువతి. గుణాగుణాలను హంసవలె గ్రహించగల చక్కనితల్లి యువతి. హింసా ప్రవృత్తితో చెలరేగే వారికి చల్లనిమాటలనుచెప్పి ఉపశమింపజేయగల సాధుశీల యువతి. గొప్ప ఆలోచనావిధానం యువతులకు సొంతం.

మ . ఒకయింటిన్ సరిదిద్దునేర్పుగల హృద్యోదాత్త విస్ఫూర్తి యిం
తికి మాత్రమ్మె లభించు నామె వలనన్ దీపించు నాయిల్లు; వే
రొక రెవ్వారిటు సేయలేరు; యువతీ ప్రోత్సాహమున్నంత జీ
విక సౌభాగ్యఫలమ్మునొంది మధురాభీష్టమ్ములన్ దీర్చెడిన్! 4

ఒకయింటిని దిద్దగలిగింది ఆ యింటి ఇల్లాలే. ఆమె వల్ల ఆయిల్లు కాంతివంత మౌతుంది. ఆవిధంగా మరెవరూ చేయలేరు. యువతులు ఉత్సాహంగా ఉంటే **అందరి జీవితాలూ ఆనందమయంగా ఉంటాయి.**

మ . తనధీశక్తినిజూపి యింటిపనినంతన్ దిద్దిజూపించు;మే
ల్కొని యర్థాది విశేషముల్ గనుచు చీకుంజింతలేకుండ జీ
వన యానమ్మొనరించు; నంతటికుటుంబమ్మున్ సదాగాచి దీ
వెనలొందున్యువతీ శిరోమణియె యుత్ప్రేక్షింప దిక్కయ్యెడిన్ 5

ఇంటిలోని యువతి అందరికంటే ముందే మేల్కొని ఆర్థిక విషయాలన్నిటినీ చూచుకొంటూ దిగులులేకుండా బ్రతుకు గడిచిపోయేలా బాధ్యత వహిస్తూ అందరిదీవెనలు పొందుతుంది.

మ . మహిళాశక్తి మహామహోన్నతము సమ్మానించు నీ లోకమున్
సహనమ్మన్న పదార్థమీమెయగు నాశావాసమందెల్ల ధీ
సహితమ్మై యలరారు శక్తి మహిళా సౌశీల్యమౌనమ్మ రూ
ప హితమ్మౌసకల ప్రపంచ జననీభాగ్యమ్మునన్ గన్పడున్ 6

మహిళాశక్తి అయేది మహామహోన్నతమౌనది. ఈ లోకమంతా వారిని సన్మానిస్తారు. ఓర్పు అంటే మహిళలేనని అందరకూ తెలుసు. దిగ్దిగంతాలలోను మహిళాశక్తి గొప్పశీలసంపదకలదని తెలుసు. యావత్ప్రపంచానికీ మహిళలే మాతృదేవతలు.

మ . జననీ! శక్తి ప్రదీపకారకమునై జన్మాది సుక్షేత్రమై
ఘనమాతృత్వ ఫలానుభావ సుమనోకారమ్మునై శుభ్ర చే
తనకున్ పుణ్యగుణానురూప ధరణీ తత్త్వమ్మునై సుప్రశాం
తిని లోకమ్మున నింపు తల్లివిగదే స్త్రీమూర్తి చింతామణీ! 7

అమ్మా! శక్తి స్వరూపిణివికదా తల్లీ నీవు! సకలజీవుల జన్మానికీ నీవు సుక్షేత్రమైనదానవు. మాతృత్వఫలాలను అందించేదానవు. గొప్పచైతన్యవంతురాలవు. పుణ్యాత్మురాలవు. భూమాతవంటి ఓర్పుగలదానివి. నీవు అందరి ఆశలను తీర్చే తల్లివి కదా!

ఉ . సృష్టికి మూలకారణము చేతనగల్గిన మాతృమూర్తియే
కష్టములోర్చి బిడ్డలసుఖమ్మునకై పలు బాధలొంది సం
క్లిష్ట దశన్ పరాక్రమమొకింత ప్రదర్శనజేసి తేర్చు ను
త్కృష్ట ధరాధిదేవత సుధీ విభవాంబుధి తన్వి యిద్ధరన్ 8

సృష్టికి చైతన్యవంతురాలయిన మాతృమూర్తియే మూలకారణం. తాను ఎన్నిబాధలనుభ వించినా బిడ్డలసుఖాన్నే కోరుకుంటుంది. బాధలు హెచ్చినప్పుడు తిరగబడగలిగింది కూడా మహిళయే. అమృతకలశంవంటి మహిళామణియే లోకంలో

ఆరాధ్యదేవత

చం . పురుషుని జన్మకారణము బుద్ధిప్రదాతయు ప్రాణదాతయున్
తరుణియెగాని వేరొకరు ధారుణిలేరు;మహాత్ములందరున్
సురుచిర మాతృదేవత విశుద్ధమనోగతి సంస్కృతీ ఫలం
బరసినవారలే జనని యంకమె వారల వృద్ధిహేతువౌ ! 9

పురుషునికి జన్మ నిచ్చినా, బుద్ధినిచ్చినా, చివరకు ప్రాణాన్నిచ్చినా మహిళయేగానీ మరొకరు కాదు. మహాత్ములందరూ మాతృదేవత ఆశీర్వచనంచేత ఉత్తమగుణాలనుపొంది జన్మించినవారే.

మ . పరమాత్ముండగు పూరుషుండు ప్రకృతీభావమ్ము నీ మాతయౌ;
తరుణీలాలనచేతనే పురుషసౌందర్యమ్ము శోభిల్లు, నం
దరు తల్లుల్ ప్రసవించినంత కడు నుత్సాహమ్ముజూపించు; సం
బరమెంతైనను మాతృదేవతదియే భాగ్యమ్మిలన్ శోభిలన్ 10

పరమాత్ముడు పురుషుడు. గృహంలోని యువతి ప్రకృతిస్వభావం కలది. ఈ తరుణీ లాలనచేతనే పురుషుని సౌందర్యం శోభిలుతుంది. తల్లివంటి యువతులు ప్రసవించిన తరువాత మహోత్సాహాన్ని ప్రదర్శిస్తారు. ఈ సంబరమంతా మాతృదేవతలదే కదా !

ఉ . జన్మమునిచ్చు తల్లియె కృశాననురూపముదాల్చి ప్రాణమున్
దున్ముని ధర్మదేవతను దూరినచో! నరకాసురుండు తా
నున్మదమొంది తూలగ ననుంగు సుతుండనియైన లేక వే
గన్ మృతుజేసె సాత్రజితి! కాంత లుదారులె ధర్మచింతనన్!! 11

ధర్మాన్ని అపహాస్యంచేస్తే జన్మనిచ్చిన తల్లికూడా యమునిరూపంతో ప్రాణాలు తీస్తుంది. నరకాసురుడు మదంచేత ధర్మాన్ని తృణీకరిస్తే తన కుమారుడనికూడా చూడకుండా సత్యభామ అతణ్ణి యమపురికి పంపింది. ధర్మరక్షణలో స్త్రీలు బాధ్యతతో వ్యవహరిస్తారు.

చం . మహిషుడు కండకావర ప్రమాదముతో జగమెల్ల చెండుచున్
విహితమెరుంగకుండ జనభేదనమున్ పొనరించుచండ లో
క హితమొనర్ప శక్తి యతగానిని ద్రుంప దశావతారముల్
సహనముతో ధరించి యమసన్నిధి కంపెను వానినొంచుచున్ 12

మహిషాసురుడు బలగర్వంతో లోకాలన్నిటిని బాధిస్తుంటే , మంచీచెడూ

చూడకుండా ప్రజలను చీల్చి చెండాడుతుంటే లోకులకు మేలుచేయదలచి శక్తిస్వరూపిణి దశావతారాలు ధరించి వాణ్ణి యమలోకానికిపంపింది.

ఉ . దుష్టములైన చట్టములతో మును నాంగ్లకిరాతకాథముల్
భ్రష్టవిధాన దుర్ధర దురాక్రమణమ్మొనరించువేళ నా
దుష్టుల ఝాన్సిలక్ష్మి తనదోర్బల కీలల కాహుతిచ్చి పై
శిష్ట చరిత్రనిల్పె! గుణశీలురుదారులు యాడువారలే! 13

దుర్మార్గపు చట్టాలతో ఆంగ్లేయులు మనల్ని పాలించినవేళ వారి భ్రష్టపాలనను దునుమాడుతూ ఝాన్సీలక్ష్మి వారినెదిరించి చాలామందిని హతమార్చి, గొప్ప చరిత్ర సృష్టించింది. ఆడువారు తలచుకొంటే ఎంతటివారినైనా మసిచేయగలరు.

ఉ . భారతజాతికిన్ పితగ బంధురఖ్యాతినిగన్న గాంధి కో
పారుణ మూర్తియై చెలగునయ్యెడ కస్తురిబా యుపాయ సం
బారమెరింగి సత్యమను వాడిశరాయుధశక్తినిచ్చుచున్
దారినిజూపె! నే మగని ధన్యత మానిని తెల్వియేగదా! 14

భారతజాతిపిత అని పేరుపొందిన మహాత్మాగాంధీ ఎప్పుడైనా తనపై కోపం చూపిస్తే భార్యయైన కస్తూరిబా గాంధీ ఉపాయంగా సత్యాగ్రహం చేసేది. ఆ రకంగా ముమ్ముందు గాంధీ సత్యాగ్రహం చేయటానికి కస్తూరిబా దారిచూపింది. మగవాడు ఏ పనిలోనైనా సఫలీకృతుడు కావాలంటే అందుకు అతనివెనుక ఒక మహిళ ఉంటుందనే విషయానికి ఇది గొప్పఉదాహరణ.

శా . ఆంధ్రున్ బిడ్డలుదెచ్చు కీర్తియని పద్యంబొప్పగా జెప్పె నె
వ్వంధ్రో కాసుల సత్కవీంద్రుడది యుద్ఘాటించునట్లియ్యెడన్
గుండ్రాకాశము భూమియందుగల శ్రీగోవిందుకున్ లక్ష్మిని
వ్వండ్రా కానుకగానటన్న కథ తద్భావంబు రూపించెడిన్ 15

“ఆంధ్రు బిడ్డలుదెచ్చు ప్రఖ్యాతిగాని మొదటినుండియు నీవు దామోదరుడవె” అనిఆంధ్రనాయకశతకంలో కాసులపురుషోత్తమకవి యేనాడో చెప్పినట్లుగా అశరీరవాణి భూలోకంలో వెలసిన శ్రీవేంకటేశ్వరునికి లక్ష్మిని కానుకలుగా ఇవ్వండని ఆదేశించిన కథావిధానంలో ప్రధానభూమిక శ్రీమహాలక్ష్మిదే. ఆఅమ్మవారే లోకంలోని యువతీలలామల స్వరూపం.